
తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
పేజీలు : 08 | వెల: రూ.3 | సంపుటి: 03 | సంచిక 134 | ఎడిటర్: దయాకర్ రెడ్డి | సోమవారం, 13 అక్టోబర్ 2025

## నేడే ఉప ఎన్నికకు నోటిఫికేషన్..!!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నగారాలో నేడు కీలక ఘట్టానికి అడుగు పడనుంది. సోమవారం ఎన్నికల సంఘం ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టనుంది. ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగనుంది.






## 'నీ కొడుకును ఎంపీగా గెలిపించింది మేం కాదా?'..

### వివేక్‌పై మంత్రి అడ్లూరి ఫైర్

**హైదరాబాద్:(అక్షరగళం):** కులం ఆధారంగా తనపై కుట్రలు, విమర్శలు చేస్తున్నారు.. చేయిస్తున్నారు అని మంత్రి వివేక్ వెంకటస్వామి కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. మంత్రి అడ్లూరి లక్ష్మణను రెచ్చగొట్టి తనపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి లక్ష్మణ్ నాపై ఎందుకు విమర్శలు చేస్తున్నారో తెలియట్లేదు, సభలు, సమావేశాలు జరిగే సమయంలో ఆయన వచ్చినప్పుడు నేను వెళ్లిపోతున్నాన నేది తప్పు, లక్ష్మణ్‌ను రాజకీయంగా ప్రోత్సహించింది మా నాన్నే, ఆ విషయాన్ని అడ్లూరి మర్చిపోయారు.. నాకు మంత్రి పదవిపై వ్యామోహం లేదు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే వ్యక్తిగతంగా నాకు మంచి పేరు వస్తుందనే ఈ కుట్ర చేస్తున్నారని మంత్రి వివేక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా వివేక్ వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందించారు. ఆదివారం సాయంత్రం ఆయన ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడుతూ.. ముగిసిన వివాదాన్ని వివేక్ మళ్లీ తెరమీదకు తెస్తున్నారు.. ఇక నేను ఏం మాట్లాడను.. వివేక్ అంశాన్ని అధిష్టానం చూసుకుంటుంది. వివేక్ వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా.. వివేక్ కొడుకును ఎంపీగా గెలిపించింది ఎవరో ఆయనకు కూడా తెలుసు.. ఎవరు ఎవరిని అవమానిస్తున్నారో చర్చకు సిద్ధం' అని వివేక్‌కు అడ్లూరి లక్ష్మణ్ సవాల్ చేశారు.



## కులం ఆధారంగా నాపై కుట్రలు చేస్తున్నారు

### మంత్రి వివేక్

**హైదరాబాద్:(అక్షరగళం):** సామాజిక మాధ్యమాల్లో టార్గెట్ చేసి.. కులం ఆధారంగా తనపై కుట్రలు, విమర్శలు చేస్తున్నారని మంత్రి వివేక్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లో జరిగిన మాలల ఐక్య సదస్సులో మాట్లాడిన ఆయన.. అడ్లూరి లక్ష్మణ్‌ను రెచ్చగొట్టి తనపై విమర్శలు చేయించారన్నారు. "జూబ్లీహిల్స్‌లో పార్టీ గెలిస్తే తనకు మంచి పేరు వస్తుందని కుట్ర చేస్తున్నారు. లక్ష్మణ్ నాపై ఎందుకు విమర్శలు చేస్తున్నారో అర్థం కావట్లేదు. ఆయన వచ్చినప్పుడు నేను వెళ్లిపోతున్నాననేది అబద్ధం. లక్ష్మణ్‌ను రాజకీయంగా ప్రోత్సహించింది మా నాన్న వెంకటస్వామి. ఈ విషయాన్ని ఆయన మర్చిపోయారు. నాకు మంత్రి పదవిపై వ్యామోహం లేదు" అని అన్నారు.

## కారు కావాలా.. బుల్డోజర్ కావాలా?

### హైదరాబాద్ అభివృద్ధి తిరిగి గాడిన పడాలంటే కేసీఆర్ మళ్లీ రావాలి

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

### చెర్క మహేశ్ చేరిక సందర్భంలో కేటీఆర్ వ్యాఖ్యలు



**హైదరాబాద్,(అక్షరగళం):** హైదరాబాద్‌లో అభివృద్ధి తిరిగి గాడిన పడాలంటే కేసీఆర్ మళ్లీ రావాలని, అది జూబ్లీహిల్స్ నుంచి మొదలు కావాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ షేక్‌పేట డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు చెర్క మహేశ్‌కు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. అన్ని అబద్ధా లు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, ఈ రెండేళ్లలో ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా కాంగ్రెస్ చేయలేకపోయిందని మండిపడ్డారు. ఒక్క ఇల్లు కట్టలేదు..ఒక్క ఇటుక పెట్టలేదు..కానీ రూ. 2.30 లక్షల కోట్లు అప్పు మాత్రం చేసిందని కేటీఆర్ విమర్శించారు. గరీబోళ్ల ఇండ్లు ఎక్కడుంటే అక్కడికి బుల్డోజర్లు పంపించి

-మిగతా 2లో


## RTI చట్టానికి బీజేపీ తూట్లు

- విజిల్ బ్లోవర్లకు రక్షణ కల్పించాలి.. టీపీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్:(అక్షరగళం):** డీపీడీపీ చట్టంలోని సమాచార హక్కు చట్టం(RTI)ని బలహీనపరిచే సెక్షన్ 44(3) సవరణలను పునఃపరిశీలించాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2019 సవరణలను రద్దు చేసి కమిషన్ల స్వతం త్రతను పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాం డ్ చేస్తోందన్నారు. RTI అమలుకు 20 ఏళ్లు పూర్తి కావడం సందర్భంగా ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడా రు. యూపీఏ ప్రభుత్వం అమలు చేసిన చారిత్రాత్మక చట్టాల ప్రాధాన్య తను ఆయన గుర్తుచేశారు. 'డా. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ

-మిగతా 2లో



## ఎస్సారెస్పీ-2కి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు

### 'ఎస్సారెస్పీ రెండోదశ'కు దామోదర్‌రెడ్డి పేరు

### సంతాప సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

**సూర్యాపేట(అక్షరగళం):** నల్గొండ జిల్లాలో తాగు, సాగునీటి అవసరాల కోసం ఎస్సారెస్పీ రెండో దశ(స్టేజీ-2)ను తీసుకురావడానికి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పోరాటం చేశారని.. ఈ ప్రాంత కార్యకర్తల, ప్రజల కోరిక మేరకు ఆ కాలువకు ఆర్‌డీఆర్ ఎస్సారెస్పీ స్టేజీ-2గా నామకరణం చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు 24 గంటల్లో జీవో ఇస్తామన్నారు. సూర్యాపేట జిల్లా తుంగ తుర్తిలో ఆదివారం నిర్వహించిన దామో దర్‌రెడ్డి సంతాప సభలో సీఎం ప్రసం గించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలతో కలిసి దామోదర్‌రెడ్డి చిత్రపటం వద్ద సీఎం నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "ఆయన మరణం అత్యంత బాధాకరం. కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ కోసం ఆస్తులను అమ్ముకున్న నిస్వార్థ నాయకుడు. ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసి టైగర్ దామన్నగా ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ విముక్తి కోసం పోరాడారు. గోదావరి జలాల కోసం ఉద్యమించి ఎస్సారెస్పీ స్టేజీ-2 ద్వారా సాగు, తాగునీటి కష్టాలు తీర్చారు" అని

-మిగతా 2లో

## మద్యం నకిలీకి చెక్

### 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్' ● ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**ఉండవల్లి,(అక్షరగళం):** రాష్ట్రానికి కల్తీ మద్యం వైకాపా ప్రభుత్వం నుంచి వారసత్వ సంపదగా వచ్చిందని ముఖ్య మంత్రి చంద్ర బాబు ధ్వజమెత్తారు. నకిలీ మద్యం కేసులో షాకింగ్ వార్తలు బయటకు వస్తున్నాయని, దీనిపై ప్రస్తుతం మాట్లాడదలచుకోలేద న్నారు. కల్తీ మద్యంపై విచారణకు జీవీజీ అశోక్‌కుమార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉండవల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో.. నకిలీ మద్యం బాటిళ్లను గుర్తించేందుకు రూపొం దించిన 'ఏపీ ఎక్సైజ్‌సురక్షా యాప్'ను చంద్ర బాబు ప్రారంభించారు. అనంతరం



## హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### కిషన్‌రెడ్డి

**హైదరాబాద్:(అక్షరగళం):** బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శిం చారు. ఆదివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. " కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఉన్నంత మాత్రాన రిజర్వేషన్ల విషయంలో ఏం చేయగలడు. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా రాష్ట్రపతి కూడా ఏం చేయలేరు. మహారాష్ట్రలో మా ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఏం చేయల ేకపోయాం. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా అక్కడ.. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. సుప్రీంకోర్టులో.. రిజర్వేషన్ల కు 50శాతం క్యాప్ పెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వం హయంలోనే. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 50శాతం క్యాప్‌నకు వ్యతిరేకంగా వాదనలు వినిపించడంలో విఫలమైంది. ఇప్పుడు హైకోర్టులో వాదనలు వినిపించడంలో విఫలమైంది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తాం. బీసీ రిజర్వేషన్ల కోసం భాజపా పూర్తి మద్దతు ఉంటుంది. జూబ్లీహిల్స్ అభ్యర్థి కోసం 3 పేర్లను జాతీయ పార్టీకి పంపించాం. పార్లమెంటరీ బోర్డు మీటింగ్ తర్వాత అభ్యర్థి ప్రకటన ఉటుంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.



## తెలంగాణ బీసీ జేఏసీ ఏర్పాటు..

### ఛైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్: తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా రాష్ట్రంలోని బీసీ సంఘాల ఆధ్వర్యంలో 'తెలంగాణ బీసీ జేఏసీ' ఏర్పాటు చేశారు. జేఏసీ ఛైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వైస్ ఛైర్మన్‌గా వీజీ నారగోని వ్యవహరించనున్నారు. బీసీ జేఏసీలో ముఖ్యమైన ఆరుగురితో కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల నినాదాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లాలని, రాష్ట్రంలో ఉద్యమం బలంగా జరిగితే.. కేంద్రంపై ప్రభావం పడుతుందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్లలో ఏ అంశం మీద కోర్టు స్టే ఇచ్చిందని కృష్ణయ్య ప్రశ్నించారు. " ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక స్టే ఇవ్వకూడదు. బీసీలకు న్యాయం కోసం ఈ నెల 18న బంద్‌కు పిలుపునిచ్చాం. అన్యాయాన్ని 76 ఏళ్లుగా బీసీలు భరిస్తూ వస్తున్నారు. బీసీలకు అన్యాయంతోపాటు ఇప్పుడు అవమానం జరిగింది. చట్టసభల్లో బిల్లు పెట్టే వరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్దాం" అని కృష్ణయ్య పిలుపునిచ్చారు.



# నామినేషన్ దాఖలుకు మార్గదర్శకాలు విడుదల

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేం దుకు సహకరించాలని జిల్లా ఎన్నికల విభాగం అధికారులు కోరారు. అర్హత కలిగిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నిబంధనలు పాటించాలని సూచించారు.

## నామినేషన్ దాఖలుకు మార్గదర్శకాలు

- అవసరమైన ఫారాలు ఫాం 2 బి (నామినేషన్), ఫాం 26 (అఫిడవిట్-అన్ని కాలమ్స్ తప్పనిసరి, నోటరైజ్ చేయాలి)
- సమయం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు (పబ్లిక్ హాలిడేలు, 2వ, 4వ శనివారాలు మినహాయింపు)
- నామినేషన్ దాఖలు చేయగలవారు అభ్యర్థి లేదా ప్రతిపాదకుల్లో ఒకరు అయి ఉండాలి
- ఫోటో పరిమాణం 2%ఠ%2.5 సెం.మీ
- అభ్యర్థి కనీస వయస్సు 25 సంవత్సరాలు
- గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థులు-ఒక్క ప్రతిపాదకుడు (నియోజకవర్గ ఓటరు)గా ఉండాలి
- స్వతంత్ర/గుర్తింపు లేని పార్టీ అభ్యర్థులైతే 10 ప్రతిపాదకులు (అందరూ నియోజకవర్గ ఓటర్లు)గా ఉండాలి
- ఇతర నియోజకవర్గ అభ్యర్థులు - సంబంధిత ఈఆర్వో నుంచి ఓటర్ల వివరాలు సమర్పించాలి నామినేషన్ సమయంలో పరిమితులు
- వాహనాలు : ఆర్వో/ఏఆర్వో కార్యాలయం 100 మీటర్ల పరిధిలో గరిష్టంగా మూడు వాహనాలు
- ప్రవేశించగల వ్యక్తులు: గరిష్టంగా 5 (అభ్యర్థి సహా).

# సంఘటితంగా ఉద్యమించి హక్కులు సాధించుకుందాం

## బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య

## 14న రాష్ట్ర బంద్ వాయిదా....18న తెలంగాణ బంద్



**ఖైరతాబాద్, అక్టోబర్ 12:** దశాబ్దాలుగా పోరాటాలు నిర్వహించి రిజర్వేషన్లు సాధించుకునే తరుణంలో ఆ ఫలాలు దక్కకుండా చేస్తున్నా రని, సంఘటితంగా ఉద్యమించి హక్కులు సాధించుకోవాల్సిన అవసరం ఉందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. లక్డీకాపూల్‌లోని హోటల్ అశోకాలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుజ్జ సత్యం అధ్యక్షతన ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య వచ్చిన నాటి నుంచి బీసీలు తమ హక్కులకు నోచుకోకుండా పోయారని, ఎన్ని ప్రభుత్వాలు మారినా వారి బతుకు లు బాగపడడం లేదన్నారు.ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్న 42 శాతం రిజర్వేషన్లు సైతం అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. కేసు వేసిన రోజు కాని, వాదో పవాదాలు జరుగుతు న్నప్పుడు కాని, సుప్రిం కోర్టుకు పోయినప్పుడు కాని కోర్టు స్టే ఇ వ్వాల్సి ఉందని, అలా కాకుండా ఎన్నికల నోటి ఫికేషన్ వచ్చిన తర్వాత స్టే ఇచ్చిన చరిత్రలో ఇప్పటి వరకు దేశంలో లేదన్నారు. ఎన్నికల నోటిఫికే షన్లు ఇచ్చిన తర్వాత ఇలాంటి కేసుల్లో స్టే ఇవ్వరాదని సుప్రిం కోర్టు స్వయంగా తీర్పునిచ్చిందన్నారు. ఇకనుంచి రిజర్వేషన్ల కోసం అడుక్కునే ఆలోచన పోవాలని, పోరాటాల ద్వారానే సాధించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ స్థాయి నుంచే కార్యాచరణ సిద్ధం చేయ వాలని, 14న జరిగే రాష్ట్ర బంద్‌ను వాయిదా వేస్తున్నామని, 18న తెలంగాణ బంద్ నిర్వ హించాలని నిర్ణయించామని, బీసీ ప్రజలందరూ స్వచ్ఛందంగా బంద్‌ను విజయవంతం చేయాలని పిలపునిచ్చారు. అనంతరం తెలం గాణ బీసీ జేఏసీ నూతన కమిటీని ప్రకటించా రు. చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా వీజీఆర్ నారగోని, వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్, కో చైర్మన్లుగా రాజారాం యాదవ్, దాసు సురేశ్, కోఆర్డినేటర్‌గా గుజ్జ కృష్ణ ఎన్నుకున్నారు.

# ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ సంఘం అధ్యక్షురాలిగా బాలకృష్ణ చిన్న కుమార్తె ఎన్నిక



రాష్ట్ర ఆర్చరీ సంఘం నూతన కార్యవర్గం కొలువైంది. ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఎన్నికల్లో నటుడు నందమూరి బాలకృష్ణ చిన్న కుమార్తె నందమూరి తేజస్విని అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఆర్చరీ సంఘం పదవుల కోసం నిర్వహించిన ఎన్నికల ఫలితాలను తాజాగా ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ సంఘం చైర్మన్‌గా చేరుకురి సత్యనారాయణ, పి. సత్యనారాయణ, వి.వి. జనార్ధన్ రెడ్డి చీఫ్ పేట్రన్లుగా, బేవర వెంకట రమణ జనరల్ సెక్రటరీగా, చేరుకురి కృష్ణ కుమారి ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. నూతన బృందం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆర్చరీ క్రీడకు మరింత ప్రాధాన్యం కల్పించి యువతను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా సంఘ వర్గాలు తెలిపాయి.

# RTI చట్టానికి బీజేపీ తూట్లు

-మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం, శ్రీమతి సోనియా గాంధీ గారి దూరదృష్టి నాయకత్వంలో RTI, MGNREGA, అటవీ హక్కుల చట్టం, విద్య హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం వంటి ప్రజా ప్రయోజన చట్టాలను అమలు చేసింది. ఇవి దేశ ప్రజాస్వామ్యానికి బల మైన పునాదిగా నిలిచాయి' అని అన్నారు. RTI చట్టం పేద, అణగారిన వర్గాలకు జీవనరేఖగా మారి, సరుకుల పంపిణీ, పెన్షన్‌లు, బకాయిలు, స్కాలర్‌షిప్‌లు వంటి హక్కులను సాధించుకునే శక్తిని ప్రజలకు ఇచ్చిందని చెప్పారు.అయితే, 2014 నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం RTIకి తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. 2019లో చేసిన సవరణల ద్వారా సమాచారం కమిషన్ల స్వ తంత్రతను తొలగించి, పదవీకాలం, సేవా షరతులను కేంద్రం ఆధీనంలోకి తీసుకువచ్చారని తెలిపారు. అదేవిధంగా 2023లో తీసుకొచ్చిన డిజి టల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం ద్వారా ప్రజా ప్రయోజన సమాచారాన్ని కూడా మినహాయింపుగా మార్చి, పారదర్శకతను దెబ్బతీశారని అన్నారు. స్వయం ప్రతిపత్తితో నిర్వహించే RTI కమిషనర్లు కేంద్రం ఒత్తిడిలకు తల్లోగే పరిస్థితి ఏర్పడింద న్నారు. కేంద్ర సమాచారం కమిషన్ ప్రస్తుతం 11 పోస్టులకు బదులుగా కేవలం 2 కమిషనర్లతోనే పనిచేస్తోందని తెలిపారు. 2025 సెప్టెంబర్ తర్వా త చీఫ్ కమిషనర్ పదవి కూడా ఖాళీగా ఉంటుంది. ఇంతకంటే దుర్మార్గం లేదు.. అని మండిపడ్డారు.

భోపాల్‌కు చెందిన పర్యావరణ కార్యకర్త షెహ్లా మసూద్ అక్రమ మైనింగ్ బహిర్గతం చేస్తూ ఉండగా ఇంటి వద్దే కాల్చి చంపబడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు RTI యాక్టివిస్టుల్లో భయాన్ని పెంచాయన్నారు. విజిల్ బ్లోవర్స్ ప్రొటెక్షన్ చట్టం.. ఈ చట్టం యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టి పార్లమెంట్ ఆమోదించినప్పటికీ 2014 నుంచి ఇప్పటి వరకు అమలు కాలేదని అన్నారు. కేంద్ర & రాష్ట్ర కమిషన్లలో ఖాళీలను తక్షణమే పారదర్శకంగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. RTI వినియోగదారులు, విజిల్ బ్లోవర్లకు బలమైన రక్షణ కల్పించాలన్నారు. కమిషన్లలో జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు వంటి విభిన్న వర్గాల ప్రతినిధులను అవకాశం కల్పించాలన్నారు. చట్టాలను కాపాడుకోవడానికి పౌరులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# పర్యటిస్తూ..పలకరిస్తూ..!!

## డివిజన్ల వారీగా ప్రజాప్రతినిధుల ఇంటింటి ప్రచారం

## బీఆర్ఎస్ నేతల పాదయాత్రకు జనం' నీరాజనం '

## పండుగ వాతావరణంలో సాగుతున్న ప్రచార శైలి



జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు, శ్రేణులు ప్రత్యేక వ్యూహాలతో ప్రచార పర్వాన్ని సాగిస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్పటికే నియోజకవర్గంలో డివిజన్ల వారీగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. నేటి నుంచి బూత్ స్థాయి సమావేశాలకు శ్రీకారం చూడుతున్నారు. ఒకవైపు సమావేశాలు మరోవైపు చేరికలతో పార్టీలో జోష్ పెంచారు. ఈ నేపథ్యంలోనే డివిజన్ల వారీగా మాజీ మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాగంటి సునీత గోపీనాథ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండటం, ప్రజలు అడుగడుగునా నీరాజనం పడుతున్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ..ఓటు అభ్యర్థిస్తూ ముందుకు వెళ్తున్న అభ్యర్థులకు వాడవాడలా, కాలనీలు బ్రహ్మరథం పడుతున్నారు.
22 నెలలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, కారు కావాలా? బుల్డోజర్ కావాలా? అంటూ ప్రచారాన్ని హీటెక్కించారు. ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీల కంటే ముందున్న బీఆర్ఎస్ జాతీయ పార్టీల డిపాజిట్లను గల్లంతు చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పావులు కదుపుతున్నారు. కలిసి వచ్చే ఇతర పార్టీల నేతలకు గులాబీ కండువాలు కప్పుతూ నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెమటలు పట్టిస్తున్నారు. అన్ని వర్గాల మద్దతును కూడగడుతూ ప్రత్యర్థులకు వెన్నులో వణుకుపుట్టిస్తున్నారు..

# కారు కావాలా.. బుల్డోజర్ కావాలా

-మొదటి పేజీ తరువాయి

ఇండ్లు కూలగొట్టిస్తున్నాడని రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ప్రజలు కారు కావాలా? బుల్డోజరు కావాలా నిర్ణయించుకోవాలని సూచిం చారు. కాంగ్రెస్ గెలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు, ప్రస్తుతం రాష్ట్రంలో రెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్నది ఎవరో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. రెండు సంవత్సరాల్లో సంపాదించిన మొత్తం అవినీతి సొమ్మును జూబ్లీహిల్స్‌లో ఖర్చు పెడుతారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే మోరీలో వేసినట్లేనని చెప్పారు. జూబ్లీహిల్ ఉప ఎన్నికతో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉన్నదని కేటీఆర్ చెప్పారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతేనే నెలకు రూ. 4వేల పెన్షన్ వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# భాజపా, జేడీయూకు చెరో 101 స్థానాలు..

## ఎన్డీయే సీట్ల సర్దుబాటు ఖరారు!



బిహార్ ఎన్నికల ( నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైంది. భాజపా, జేడీయూలు చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29 స్థానాల్లో బరిలో దిగనుంది. కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎం)కు, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుశ్వాహా సారథ్యంలోని రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్‌ఎల్‌ఎం)కు ఆరు చొప్పున సీట్లు కేటాయించారు. కూటమి పక్షాలు ఈ సర్దుబాటును స్వాగతించాయని కేంద్రమంత్రి, భాజపా సీనియర్ నేత ధర్మేంద్ర ప్రధాన్ ట్వీట్ చేశారు. బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 2020 ఎన్నికల్లో నీతీశ్ పార్టీ 115 స్థానాల్లో బరిలో దిగగా.. కాషాయదళం 110 సీట్లకు పోటీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే 22 సీట్లలో పోటీ చేసిన ఎల్‌జేపీ (రాంవిలాస్).. ఈసారి అదనంగా మరో ఏడు స్థానాల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. మరోవైపు.. ప్రతిపక్ష 'ఇండియా' కూటమి (మహాగఠ్‌బంధన్)లో సీట్ల సర్దుబాటుపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. ఆర్జేడీ 135-140 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ 70 సీట్లు అడుగుతుండగా 50-52 వరకు ఇస్తామంటోంది. బిహార్‌లో వచ్చే నెల 6, 11వ తేదీల్లో రెండు దశల్లో పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.



## లోకల్ ట్రైన్‌లో సీటు దొరకలేదని..

# ప్రయాణికులపై కారం చల్లిన మహిళ

లోకల్ ట్రైన్‌లో సీటు దొరకపోవడంతో ఒక మహిళ ఆగ్రహించింది. ప్రయాణికులపై కారం చల్లుతానని బెదిరించింది. ఒక మహిళ జోక్యంతో మరింత రెచ్చిపోయింది. ఆ కంపార్ట్‌మెంట్‌లో పెప్పర్ చల్లింది. దీంతో కారం ఘాటుకు కొందరు ఇబ్బందులకు గురయ్యారు.కోల్‌కతా: లోకల్ ట్రైన్‌లో సీటు దొరకపోవడంతో ఒక మహిళ ఆగ్రహించింది. ప్రయాణికులపై కారం చల్లుతానని బెదిరించింది. ఒక మహిళ జోక్యంతో మరింత రెచ్చిపోయింది. ఆ కంపార్ట్‌మెంట్‌లో పెప్పర్ చల్లింది. దీంతో కారం ఘాటుకు కొందరు ఇబ్బందులకు గురయ్యారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఈ సంఘటన జరిగింది. లోకల్ రైలు సీల్దా స్టేషన్ చేరగా ఒక మహిళ ఎక్కింది. ఆమెకు సీటు దొరకకపోవడంతో అసహనం వ్యక్తం చేసింది. హ్యాండ్ బ్యాగ్ నుంచి పెప్పర్ స్ప్రే డబ్బా తీసింది. ప్రయాణికుల ముఖంపై చల్లేందుకు ప్రయత్నించింది.

# డేటింగ్‌లో ట్రూడో.. పాప్‌స్టార్‌తో సరసాలు!



కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో .. అమెరికన్ పాప్‌స్టార్ కేటీ పెర్రీతో డేటింగ్‌లో ఉన్నారంటూ వార్తలు వస్తున్న వేళ తాజాగా ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. ఓ నౌకపై పెర్రీతో ట్రూడో విహరిస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చొక్కా లేకుండా ఉన్న ట్రూడో.. స్విమ్‌సూట్‌లో ఉన్న పెర్రీని కిస్ చేస్తున్నట్లు అందులో కనిపించింది.
ఈ ఏడాది జులైలో ట్రూడో-పెర్రీలు మాంట్రియాల్‌లోని ఓ రెస్టరంట్‌లో తొలిసారి కనిపించారు. ఆ సాయంత్రం దాదాపు రెండు గంటల పాటు గడపడం మీడియా దృష్టిని ఆకర్షించింది. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే ప్రచారం మొదలైంది. ట్రూడో-కేటీలు దీనిపై ఇప్పటి వరకు స్పందించలేదు. ఈ క్రమంలోనే కాలిఫోర్నియాలోని శాంటా బార్బరా తీరంలో ఓ ఖరీదైన నౌకపై ఇటీవల విహరించినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అత్యంత సన్నిహితంగా ఉన్న ఫొటోలు కూడా వైరల్ అయ్యాయి. దాదాపు దశాబ్దం పాటు కెనడా ప్రధానిగా ఉన్న ట్రూడో ఈ ఏడాది జనవరిలో తన పదవికి రాజీనామా చేశారు. అంతకుముందు 18 ఏళ్ల వివాహ బంధానికి ముగింపు పలికిన ఆయన.. భార్య సోఫీ గ్రెగొరీతో 2023 ఆగస్టులో విడిపోయారు. వీరికి ముగ్గురు పిల్లలు. ఇక 13 సార్లు గ్రామీ అవార్డుకు నామినేట్ అయిన కాలిఫోర్నియాకు చెందిన పాప్‌స్టార్ కేటీ పెర్రీ వ్యక్తిగత జీవితం కూడా ఇటీవల వార్తల్లో నిలిచింది. నటుడు ఓర్లాండో బూమ్‌తో ఏడేళ్లుగా కలిసి ఉన్న ఆమె.. ఈ ఏడాది జూన్‌లో విడిపోయింది. 2020లో వీరికి ఓ అమ్మాయి జన్మించింది.

# మద్యం నకిలీకి చెక్

-మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ.. నకిలీ మద్యంపై సిట్ బృందంతో మొత్తం ప్రక్షాళన చేస్తామన్నారు. సిట్‌లో రాహుల్‌దేవ్ శర్మ, కె.చక్రవర్తి, మలికా గార్గ్ సభ్యులుగా ఉంటారని చెప్పారు."నకిలీ మద్యం బాటిళ్లను గుర్తించేందుకు 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్' ను డిజైన్ చేశాం. స్కాన్ చేస్తే చాలు.. ఆ సీసాకు సంబంధించిన వివరాలన్నీ తెలుస్తాయి. ఎక్కడ అమ్ముతారో అక్కడే జియో ట్యాగింగ్ అవుతుంది. మరోచోట అమ్మేందుకు వీల్లేదు. అలా చేస్తే నేరం కూడా. స్కాన్ చేశాక తయారీ కేంద్రం, తేదీ, బ్యాచ్ అన్నీ వివరాలు తెలుస్తాయి. ప్రస్తుతం గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది. వినియోగదారులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్, యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా చూస్తాం. నకిలీ మద్యం కేసులో ఎలాంటి రాజీ లేదు.. మొత్తం ప్రక్షాళన చేస్తాం. బెల్ట్ షాపుల్లో అమ్మేవారిపై కఠిన చర్యలు ఉంటాయి" అని చంద్రబాబు స్పష్టం చేశారు. గంజాయి, మరో వైపు కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని గత పాలకులు చిన్నాభిన్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ మద్యాన్ని చట్టబద్ధం చేసి మరీ నేర సామ్రాజ్యం సృష్టించారని మండిపడ్డారు. కల్తీ మద్యం నివారణకు సిట్, గంజాయ్ నివారణకు ఈగల్ బృందాలు ఏర్పాటు చేసి కట్టడి చేశామని సీఎం వెల్లడించారు. ఇంత చేస్తున్నా కొందరు బరితెగిస్తే చూస్తూ ఊరుకుంటామా అని హెచ్చరించారు. నేరస్థులు ఏ ముసుగులో వచ్చినా కట్టడి చేసి తీరుతామని తేల్చిచెప్పారు. ఎంతటి వారైనా, ఎవరైనా ఉపేక్షించేది లేదని సీఎం స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో తప్పులు చేస్తే ఉపేక్షించే సమస్యే లేదన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం చెప్పారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం




## తెలంగాణ రౌండప్

## నిండు జీవితానికి రెండు చుక్కలు



**ఆమనగల్లు, అక్టోబర్ 12 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు వారి పిల్లలను తీసుకొని అధిక సంఖ్యలో హాజరై 5 సంవత్సరాలలోపు ఉన్న తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించారు. ఉదయం 7 గంటలకు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మైమున బేగం, మంజులా దేవి మాట్లాడుతూ.. చిన్నారుల్లో పోలియో వ్యాధి నివారణకు 5 సంవత్సరాలలోపు ఉన్న వారి పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్యార్మీ షరీఫ్

### పట్టణంలో గ్యార్మీ జెండాతో ఊరేగింపు

### గౌసే పాక్ దర్గా వద్ద దువా ప్రత్యేక ప్రార్థనలు

### పాల్గొన్న మత గురువు హజ్రత్ సయ్యద్ జహీర్దిన్ షా ఖాద్రి

### సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**ఆమనగల్లు, అక్టోబర్ 12 (అక్షర గళం):** అమనగల్లు పట్టణంలో ఆదివారం గ్యార్మీ వేడుకలను ముస్లిం మైనారిటీలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా మౌలాలి పహాడ్ దర్గా సమీపంలోని గౌసే పాక్ చిల్లా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముస్లింల మత గురువు హజ్రత్ సయ్యద్ జహిర్దిన్ షా ఖాద్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ ముస్లిం మైనారి టీలతో కలిసి గ్యార్మీ షరీఫ్ జెండాతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గౌసే పాక్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు, దువా, సలాం, ఫతియాలు కార్యక్రమాలు నిర్వహించారు. మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌస్ మైనోద్దీన్, ఖాదర్ ఖాద్రి, జలాల్, చాంద్ పాషా, జబ్బర్, అబ్దుల్ ఖాదర్, కరీం, మహబూబ్, అబ్బు, బాబా, అబ్దుల్ అలీమ్, అజీమ్, హఫీజ్, హనీఫ్, జహంగీర్, ఫరూక్, నాజర్, అఫ్సర్, కలీం, అఫ్రిది, అహ్మద్, జహంగీర్, అక్బర్, అసద్, నిరంజన్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



## బంద్‌కు సహకరించాలి

**ఆమనగల్లు, అక్టోబర్ 12 (అక్షర గళం):** బీసీల రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించ డాన్ని నిరసిస్తూ ఈ నెల 14న నిర్వహించే బందు అందరూ సహకరించాలని ఆమన గల్లు బిసి ఐక్యవేదిక సభ్యులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బిసిల 42 శాతం రిజర్వేషన్ సాధించేంత వరకు అలుపెరుగని పోరాటం చేస్తామని సంఘటితంగా ముందుకు సాగి న్యాయంగా దక్కవలసిన హక్కులను సాధించుకుంటామన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని మాస్టర్ డిగ్రీ కళాశాల ఆవ రణలో ఆమన గల్లు బీసీ ఐక్యవేదిక ప్రత్యే క సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బిసి సంఘం పిలుపుమేరకు అక్టోబర్ 14న తలెపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్ విజయ వంతం, నిర్వహణపై చర్చించారు. పగడ్బం దీగా బంద్‌ను విజయవంతం చేసేందుకు అన్ని బీసీ కులాల ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు దక్కవలసిన హక్కుల ను కాలరాస్తున్న ప్రభుత్వాలకు బీసీల ఐక్యతతో గుణపాఠం చెప్పే విధంగా ముందుకు సాగుతామన్నారు.

**నేడు సన్నాహక సమావేశం....**

బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమ వారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు బీసీ ఐక్యవేదిక తెలిపింది. పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించ నున్న సన్నాక సమావేశానికి అన్ని కులాల బిసి సంఘాలు హాజరుకావాలని కోరింది. బీసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రోజు నిర్వహిం చే తెలంగాణ రాష్ట్ర బంద్ నిర్వహణపై సన్నాహక సమావేశంలో చర్చించనున్నట్లు ఐక్యవేదిక తెలిపింది. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక ప్రతినిధులు చుక్క అల్లాజి గౌడ్, తల్లోజు రామకృష్ణ, ఎంగలి బాలకృష్ణ, అ వ్వారి శివలింగం, నిరంజన్ గౌడ్, కోట్ల వెంకటేష్, దుడ్డు ఆంజనేయులు, గోల్డ్ రాము, నాగిళ్ల జగన్, గాజుల శ్రీను, పూసలి పరమేష్, దేవరకొండ రమేష్ తదితరులు ఉన్నారు.

## పోలియో రహిత సమాజమే లక్ష్యం

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, అక్టోబర్ 12 (అక్షర గళం):** పోలియో రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని, దీనికి ప్రజలందరూ సహకరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో పల్స్ పోలియో చుక్కల మందు కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. పిల్లలను ఆరోగ్యవంతమైన పౌరులుగా పెంచి, సమాజానికి అందించాల్సిన బాధ్యత వారి తల్లిదండ్రులపై ఉందని అన్నారు. అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో డ్రాప్స్ తప్పనిసరిగా వేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మైమున బేగం, మంజులా దేవి, సీహెచ్ఓ విజయలక్ష్మి, హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ ఎంపీపీ అనిత విజయ్, నాయకులు మెకానిక్ బాబా, అవ్వారి శివలింగం, గాజుల శ్రీనివాస్, విజయ్ రాథోడ్, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, తల్లోజు రామకృష్ణ, సురేందర్ రెడ్డి, శ్రీను నాయక్, మహేష్ సుక్క వెంకటయ్య, శ్రీనివాస రావు, వైద్య సిబ్బంది డిపిఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, రవికుమార్, సూపర్వైజర్ నాగేశ్వరి, ఏఎన్ఎం లు మాధవి ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేదల కోసం సీఎం రిలీఫ్ ఫండ్

### కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశ మల్ల కృష్ణ



**వెల్దండ అక్టోబర్ 12 (అక్షర గళం)** అనారోగ్యం పాలైన పేదల వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ తోడ్పాటును అందిస్తుందని కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశ మల్ల కృష్ణ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలు ఉన్నత వైద్యం పొందేందుకు ఈ ఫండ్ ఉపయోగపడుతుందన్నారు వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాటిక మనిషా అనారోగ్యంతో హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 24,000వేల చెక్కును బాధితురాలికి కుటుంబ సభ్యులకు పెద్దాపూర్ గ్రామంలో అందజేశారు మాట్లాడుతూ కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశ మల్ల కృష్ణ ఇందిరమ్మ రాజ్యంలో పేదల కోసం ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి జంగయ్య గౌడ్ విజేందర్ రామస్వామి రాములు కృష్ణయ్య బాలయ్య తిరుపతి నాయక్ సుధాకర్ కొండల్ శివ ధనుష్ ఎండి అజార్ అనిల్ కుమార్ రమేష్ మహేష్ కిరణ్ శ్రీను ప్రశాంత్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు తప్పక వేయించాలి

### బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్

### కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి



**ఆమనగల్లు, అక్టోబర్ 12 (అక్షర గళం):** 0-5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కల మందు వేయించాలని కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి తల్లిదండ్రులకు సూచించారు. దేశంలో పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిన పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు వ్యాక్సినేషన్ సెంటర్లను నర్సింహ్మా రెడ్డి సందర్శించారు. గ్రామంలో గాంధీజీ విగ్రహ కూడలిలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ సెంటర్‌లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్ స్థానిక నేతలతో పాల్గొని 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వ్యాక్సినేషన్ కేంద్రాలకు తీసుకువెళ్లి పోలియో డ్రాప్స్ వేయించడం ద్వారా దేశాన్ని పోలియో రహిత భారతంగా నిలబెట్టడంలో భాగస్వాములు అవుతారని తెలిపారు. పోలియో పూర్తిగా నిర్మూలించబడిన దేశంగా రూపుదిద్దుకోవడంలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. పిల్లల భవిష్యత్తుకు పోలియో చుక్కలు తప్పనిసరి అని, అంగన్వాడీ మరియు ఆశా వర్కర్ల పనితీరును అభినందించారు. కార్యక్రమంలో జల్కం నాగార్జున, రాయికంటి సురేష్,అహ్మద్, అంగన్వాడీ టీచర్లు భాగ్యమ్మ, యాదమ్మ ఆశా వర్కర్లు సబితా తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ ప్రయోజనం

### రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి

**ఆమనగల్లు, సెప్టెంబర్ 27 (అక్షర గళం):** పేదలకు ఆపత్కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం ఆర్ఎఫ్) వరంలా ఉపయోగపడుతోందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మాడుగుల మండలం అందుగుల గ్రామానికి చెందిన చిత్తపురం రవీందర్ కు గోలీ శ్రీనివాస్ రెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి నుండి 60 వేల రూపాయలు మంజూరయ్యాయి. ఆదివారం బాధితుడికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తుందన్నారు. అనారోగ్యాలకు గురైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ తో ఉపశమనం కలుగుతుందన్నారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పేద మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో గానో తోడ్పాటునందిస్తుందని గోలీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వెల్దండ మండల మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, తలకొండపల్లి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, వెల్దండ మండలం మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బొజ్జయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### - ఎస్ఐ వెంకటేష్



**ఆమనగల్లు, అక్టోబర్ 12 (అక్షర గళం):** మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని వాహనదారులను ఆమనగల్లు ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్లో భాగంగా పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు అక్రమ రవాణా అరికట్టేలా చర్యలు తీసుకోవడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, వాహనాలకు సరైన రికార్డులు లేకపోవడం, పెండింగ్ చలానాలు, తదితరాలను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని, చలనాలు పెండింగ్ లేకుండా చెల్లించాలని, మద్యం సేవించి వాహ నాలు నడపరాదని ఎస్ఐ వెంకటేష్ సూచించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఎస్ఐ సీతారాం రెడ్డి, పోలీస్ కానిస్టేబుల్స్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మహాసభలకు తరలిరండి...



**ఆమనగల్లు, అక్టోబర్ 12 (అక్షర గళం):** ఇబ్రహీంపట్నంలో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించే మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ నేతలు కోరారు. ఈ మేరకు ఆదివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై, వారి పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిపై రెండు రోజులు ప్రతి నిధులు చర్చిస్తారని చెప్పారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు సబియా బేగం, పద్మ, లక్ష్మమ్మ, బుజ్జమ్మ, వరలక్ష్మి, సువర్ణ, శ్రీలత, రాములమ్మ, జంగమ్మ, యశోద తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
సోమవారం, 13 అక్టోబర్ 2025

## సంపాదకీయం

# ఎన్నికల సంస్కరణలే శరణ్యం!

దేశంలో ఎన్నికల సంస్కరణలకు ఇదే సమయం. దీనిపై ప్రస్తుత సమావేశాల్లో దీనిపై చర్చ జరగాలి. అవసరమైతే రాజ్యాంగ సవరణ జరగాలి. ఒక్క దొంగ ఓట్ల గురించే చర్చ కాదు..అనేక విషయాలపై చర్చ జరగాలి. ఏకపక్షంగా కొందరే దేశాన్ని పాలించే దౌర్భాగ్య వ్యవస్థ నుంచి భారత్ బయటపడాలి. ఇందుకోసం అవసరమైన చర్చ జరగాలి. సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. ప్రధానంగా కొందరే పార్లమెంట్‌కు వరుసగా ఎన్నికయ్యే దుర్విధానం పోవాలి. అలాగే ఒక్కరు రెండుసార్ల కటే ఎక్కువగా పార్లమెంట్, అసెంబ్లీలకు ఎన్నిక కాకుండా కఠిన నిబంధనలు విధించాలి. ప్రధాని, మంత్రులుగా రెండు పర్యాయాలకంటే ఎక్కువ ఉండకుండా నిబంధనలు విధించుకోవాలి. శాసనమండళ్లతో పెద్దగా లాభం లేదు. దీనిపై చర్చ జరగాలి. వీటిని రద్దు చేసుకోవడం మంచిది. రాజకీయ వ్యవస్థల కారణంగా ప్రజలు పన్నులతో కడుతున్న డబ్బులు దుబారా అవుతున్నాయి. రాజకీయ నేతల విలాసాలకు డబ్బులు వృధా చేస్తున్నారు. అలాగే ఎంపిలు, ఎమ్మెల్యేలకు జీతభత్యాలు, పెన్షన్లు తొలగించాలి. ఒక్కొక్కరు రెండు పెన్షన్లు పొందడాన్ని తక్షణమే రద్దు చేయాలి. ఎంపిటిసిలు, జడ్పిటిసిల వ్యవస్థను రద్దు చేయాలి. వీటితో పాటు గవర్నర్ వ్యవస్థను కూడా రద్దు చేయాలి. ఇకపోతే ప్రతస్తు బీహార్ ఓట్ల సవసరణపై విపక్షాలు రచ్చ చేస్తున్నాయి. దీంతో సభాసమయం వృధా అవుతోంది. వీటికి చిత్తశుద్ధి ఉంటే ఈ అంశంపై ఏదో ఒక రూపంలో చర్చకు అవకాశం ఉంది. అలా కాకుండా సభలో లొల్లి చేసి గందరగోళం సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలి. ఇకపోతే ఓట్ల నమోదు అన్నది శాస్త్రీతయంగా ఉండాలి. ఆధార్ తరహాలో పర్మినెంట్ కార్డు నంబర్ కేటాయించేలా చర్యలు తీసుకోవాలి. ఆధార తరహాలో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉండాలి. అడ్రస్ మార్చాలనుకున్నా సులువుగా ఆన్‌లైన్‌లో చేసుకునేలా ఉండాలి. ఓటర్లు ఎక్కడికైనా మార్పు చేసుకునే వీలుండాలి. అలాగే చనిపోయిన వారి వివరాలు గ్రామస్థాయిలో సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేసి, తొలంగించే వెసలు బాటు కలిగి ఉండాలి. లేదా ఇసికి సమాచారం ఇవ్వగలగాలి. నిజానికి ఇవన్నీ ప్రధాన సమస్యలు ఉండగా కేవలం బీహార్‌లో ఓటర్ల నవీకరణపైనే కేవలం ఆందోళన చెందడం సరికాదు. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభల్లో గత పక్షం రోజులగా బీహార్ ఓటర్ల నమోదుపై ఆందోళన కారణంగా పార్లమెంట్ ఉభయ సభలు పెద్దగా కార్యకలాపాలు సాగించలేక పోతున్నాయి. దేశంలోని 4,130కుపైగా ఉన్న అసెంబ్లీ స్థానాల్లో కర్నాటకలోని ఒక్క మహదేవపుర అసెంబ్లీ స్థానంలో చోటు చేసుకున్న ఓటర్ల జాబితా అక్రమాలను చూసిన తర్వాత..మన ఓటరు జాబితాలు తప్పుల తడకలా? లేక దొంగ ఓటర్ల పనా అన్న అనుమానాలు వచ్చి నప్పుడు పారదర్శకంగా పరిశీలించుకునే అవకాశం ఇవ్వాలి. నిజంగానే దొంగ ఓట్లు, దొంగఓట్లు వేయడం వంటివన్నీ అరికట్టాలి. ఇదంతా పటిష్ట వ్యవస్తతో మాత్రమే సాధ్యం. అవన్నీ దొంగ ఓట్లే అని ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై విచారణ జరపడంలో సందేహం ఉండాల్సిన పనిలేదు. ప్రభుత్వంతో పాటు ఎన్నికల వ్యవస్థను పర్యవేక్షిస్తున్న రాజ్యాంగబద్ధసంస్థ ఎన్నికల సంఘం కూడా ఇలాంటి వాటికిఒ జవాబుదారీగా ఉండాలి. అయితే ఇప్పుడున్న వ్యవస్థలో దొంగోట్ల నమోదు, దంగ ఓట్లు వేయించు కోవడంలో రాజకీయ పార్టీలు ఆరితేరాయి. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఓటర్ నమోదు ప్రక్రియ పారదర్శకంగా సాగాలి. అలాకాకుండా దొంగ పేర్లు, దొంగ ఓట్లు నమోదు చేయడం వంటివన్నీ చూస్తున్నాం. పోలింగ్ బూతుల ఆక్రమణ, రిగ్గింగ్ వంటి దుర్మార్గాలను చూస్తున్నాం. ఇవన్నీ పోవాల ంటే సమగ్ర చట్టాలు రావాలి. అందుకే సమగ్ర ఎన్నికల వ్యవస్థ లేకుండా ఇప్పుడున్న రీతిలో ముందుకు సాగలేం. దొంగ ఓట్లను నమోదు చేయించడం, వేయించడం అన్నది రాజకీయ పార్టీలు అవలంబిస్తూ వస్తున్న దుర్మార్గపు చర్యలగానే చూడాలి.



# సైనికుల పిల్లలు నాన్‌లోకల్ అవుతున్నారు

## మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, సిద్దిపేట టౌన్:** దేశసేవ కోసం సరిహద్దుల్లో పనిచేస్తున్న సైనికుల పిల్లలు ఇక్కడ చదువుల్లో, ఉద్యోగాల్లో నాన్‌లోకల్ అవుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే మాజీ సైనికోద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. సిద్దిపేట జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దేశ ప్రజలు సురక్షితంగా జీవిస్తున్నారంటే సైనికుల త్యాగఫలమే కారణం. మాజీ సైనికోద్యోగుల కోసం సిద్దిపేటలో త్వరలోనే భవనాల కోసం స్థలాన్ని మంజూరు చేస్తాం. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. అసువులు బాసిన సైనికుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా, ప్రైవేటులోనైనా ఉద్యోగాలు వచ్చేలా సహకారం అందిస్తాం' అని అన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను హరీశ్‌రావు సన్మానించారు. సంఘం అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

### గల్ఫ్ కార్మికులకు హరీశ్‌రావు భరోసా

జోర్డాన్‌లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులను తెలంగాణకు రప్పించేందుకు కృషి చేస్తున్నామని హరీశ్‌రావు భరోసానిచ్చారు. నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేటలకు చెందిన 12 మంది కార్మికులతో ఆదివారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. 'విదేశీ వ్యవహారాలశాఖ అధికారులు, భారత రాష్ట్ర సమితి ఎంపీ సురేశ్‌రెడ్డితో సంప్రదింపులు జరుపుతున్నాం' అని అన్నారు. స్వదేశం వెళ్లాలంటే జరిమానా కట్టాలంటున్నారని కార్మికులు తెలిపారు.

## పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామిని

# కలిసిన కాంగ్రెస్ నాయకులు



**వెల్దండ అక్టోబర్ 12 (అక్షర గళం):** నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి నూతన అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకుడు, పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి ని వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి.విజయ్ కుమార్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మోతిలాల్, కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, తక్కళ్ళపల్లి. శేఖర్,కడారి శ్రీనివాస్ యాదవ్ పాండు నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై చొరవతో రోడ్డుపై గుంతలు.. పూడ్చివేత

**వెల్దండ అక్టోబర్ 12 (అక్షర గళం):** వెల్దండ మండల సమీపంలోని కల్వకుర్తి నుండి హైదరా బాద్ వెళ్లే రోడ్డు మార్గంలో కొట్ర గేట్ చౌరస్తా వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంస మైంది దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తరచు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కొరకై జిల్లా ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఆదేశాల మేరకు ఆదివారం వెల్దండ ఎస్సై కురుమూర్తి ప్రత్యేక చొరవ తీసుకొని గుంతలు పడిన ప్రదేశం పై కాంక్రీట్ తో గుంతలను పూడ్చివేయడం జరిగిందని ఎస్సై కురుమూర్తి తెలియజేశారు. కొట్ర గ్రామ స్తులు, పలువురు వాహనదారులు ఎస్సై కురు మూర్తిని అభినందించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి, కానిస్టేబుల్ శ్రీను,రఘు, పర్వతాలు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు



## ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు:

# హైడ్రాకు ఫిర్యాదు

### ఏఎస్ రావునగర్ డివిజన కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి



**ఏఎస్ రావునగర్, అక్టోబర్ 12, (అక్షర గళం) :** ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని 199/1, 376 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూమిలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాల విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. లావణ్య పట్టా పేరుతో ప్రభుత్వ భూమి ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆమె తెలిపారు. జమ్మిగడ్డ మారుతి నగర్ లో ఎకరంన్నర ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఇందులో ఇప్పటికే కొన్ని డూప్లెక్స్ ఇండ్లు నిర్మిస్తున్నారని, ప్రస్తుతం దాదాపు 12 గుంటల భూమి మిగిలి ఉందన్నారు. ఈ విషయమై కాప్రా తహసిల్దార్ సుచరిత కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ స్థలంలో అక్రమార్కులు యదేచ్చగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని ఆమె అన్నారు. ఈ విషయంలో తగిన విచారణ జరిపి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని ఆమె కోరారు.

# పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలి

### ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి

**మేడ్చల్ ప్రతినిధి, అక్టోబర్ 12, (అక్షరగళం) :** 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి, పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో "సబ్ నేషనల్ పల్స్ పోలియో ప్రోగ్రాం"ను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరి మల్లాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, అనంతరం వివిధ పోలియో బూత్‌లను సందర్శించి పర్యవేక్షణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మొదలైన వారు పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.డా. ఉమా గౌరి మాట్లాడుతూ, జిల్లాలో 5,24,973 మంది 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయవలసి ఉందని, ఇందుకోసం 1125 బూతులు, 31 మొబైల్ టీమ్స్, 31 ట్రాన్సిట్ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అదనంగా, మైగ్రెంట్ జనాభాకు చెందిన పిల్లలు ,హై రిస్క్ ప్రాంతాల్లో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు అందించేందుకు వైద్య అధికారులు మరియు సిబ్బంది మొబైల్ టీమ్స్ ద్వారా వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 13 నుండి 15 వరకు మూడు రోజులపాటు సిబ్బంది గృహ గృహాలకూ వెళ్లి, ఈరోజు పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమం ముగిసే నాటికి 100% పిల్లలకు పోలియో చుక్కలు వేయించి, జిల్లాలో పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రభుత్వ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, ప్రోగ్రాం అధికారులు, జిల్లా ఇమ్యూనైజేషన్ టీమ్, వైద్యాధికారులు, పిహెచ్‌సి సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, నర్సింగ్ విద్యార్థులు, పారామెడికల్ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

### బీసీలను కాంగ్రెస్ అన్యాయం చేసింది.

### కామారెడ్డిలో సాధారణ ఎన్నికల ముందే బీసీ డిక్లరేషన్ ప్రకటించింది. ఈనెల 14న రాష్ట్ర బందుకు సంపూర్ణ మద్దతు.

### కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్



**కల్వకుర్తి అక్టోబర్ 12( అక్షర గళం):** బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సాధారణ ఎన్నికల ముందే కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ ప్రకటించినట్లు 42 శాతం రాజ్యాంగ భద్రత కల్పించి రాజ్యాంగ 9వ షెడ్యూల్ పెట్టి బిల్లు వచ్చిన తర్వాత ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించి పార్లమెంట్లో పెట్టించకుండా కేవలం అసెంబ్లీకి లేకున్నా అసెంబ్లీలో బిల్లు పెట్టిన తర్వాత జీవో నెంబర్ 41 42 మరియు జీవో నెంబర్ 9 తీసుకు వచ్చి ఎన్నికల్లో షెడ్యూల్ ప్రకటించినట్లు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. ఆదివారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందని ఆరోపించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు జీవో నంబర్ 9 కేసును కొట్టివేయడం జరిగిందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్కు బీసీలంతా ఐక్యతంగా ఉండి రాష్ట్ర బీసీ సంఘాలు ఈనెల 14న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బందుకు పిలుపునిస్తున్నామని సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని బంధు పిలుపుకు బి ఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ. ఎస్ టి.బీ సీ మైనార్టీ సంఘాల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొని నిరసన తెలియజేసి బందును విజయవంతం చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు.



# శుభకార్యాల్లో పాల్గొన్న కాయితీ ఆశదీప్‌రెడ్డి

**కల్వకుర్తి అక్టోబర్ 12 ( అక్షర గళం) :** కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ గ్రామానికి చెందిన గారాల సంజీవ ఇంటి గృహప్రవేశం పుట్టు పంచల కార్యక్రమానికి ఆదివారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కాయితి ఆశాదీప్ రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తర్నికల్ గ్రామ నాయకులు యువకులు పాల్గొన్నారు.

# పేదల పాలిట వరం సీఎం రిలీఫ్ ఫండ్

### రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**కల్వకుర్తి అక్టోబర్ 12( అక్షర గళం):** తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడ లేని విధంగా పేద మధ్యతరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా కల్పిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని మాడుగుల మండలం అందుగుల గ్రామానికి చెందిన చిత్తాపురం రవీందర్ అనారోగ్యానికి గురి కావడంతో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మం జూరైన 60 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును బి ఆర్ఎస్ నాయకులు చిత్తాపురం అనీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండల మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్ తలకొండపల్లి బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, వెల్దండ మండల మాజీ బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బొజ్జయ్య గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# వణికిస్తున్న చికున్ గున్యా.. 60 రెట్లు పెరిగిన కేసులు..

తెలంగాణ: చికున్ గున్యా వణికిస్తోంది. ఈ ఏడాది కూడా రాష్ట్రంలో ఎక్కువగానే చికున్ గున్యా కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ నివేదిక విడుదల చేసింది. ఈ రిపోర్టు ప్రకారం.. 2020, 2024 మధ్య తెలంగాణలో (సస్పెక్టెడ్) చికున్ గున్యా కేసులు 60 రెట్లు పెరిగాయి. దేశవ్యాప్తంగా రాష్ట్రాల్లో కేసుల పెరుగుదలలో.. తెలంగాణ టాప్‌లో ఉండటం గమనార్హం. 2025లో కూడా వాతావరణ పరిస్థితుల వల్ల తెలంగాణలో కేసులు పెరిగాయి.

2021లో కేవలం 220 (సస్పెక్టెడ్) కేసులు మాత్రమే నమోదవగా.. 2024లో ఆ సంఖ్య 13,592కు చేరింది. అంటే 60 రెట్లు కేసుల సంఖ్య పెరిగింది. ఆ తర్వాత స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటికీ.. చికున్ గున్యా కేసుల పెరుగుదల చాలా తక్కువగా ఉంది. ఇక్కడ 2021లో 753 కేసులు నమోదవగా.. 2024లో దాదాపు ఆరు రెట్లు పెరిగి.. 4,213కి చేరుకుంది. ఆ తర్వాత స్థానాల్లో.. హర్యానా (765 నుంచి 2,766), మధ్యప్రదేశ్ (3,822 నుంచి 13,677), పంజాబ్ (644 నుంచి 2,258), కర్ణాటక (40,134 నుంచి 78,217) ఉన్నాయి. 2025లో ఆగస్టు వరకు తెలంగాణలో కేసుల పెరుగుదల కొనసాగిందని నివేదిక పేర్కొంది. 7,176 (సస్పెక్టెడ్) కేసులు నమోదైనట్లు తెలిపింది.



**కేసుల పెరుగుదలకు కారణాలివే..**

పాత పైపులైన్లు మూసుకుపోవడం, దెబ్బతినడం, మ్యాన్‌హోల్స్ నుంచి వ్యర్థాలను సరిగ్గా తొలగించకపోవడం వల్ల మురుగునీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. ఇది ప్రధాన సమస్యగా పేర్కొంటున్నారు వైద్యులు. దీనికి తోడు నీటి కాలుష్యం, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం వంటి కారణాల వల్ల వైరస్ వ్యాప్తి చెందుతోందని తెలిపారు. అందుకే ముఖ్యంగా వర్షాకాలంలో ఎక్కువ కేసులు నమోదయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఇక ఈ ఏడాది హైదరాబాద్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా ఆగస్టు, సెప్టెంబర్‌లలో వరదలు, ఎక్కడపడితే అక్కడ నీరు నిలిచిపోయిందని తెలిపారు. దీంతో దోమలకు అనువైన పరిస్థితి ఏర్పడిందని వైద్యులు చెబుతున్నారు.

**కేసులు తగ్గాలంటే ఏం చేయాలి?**

లార్వాను నిరోధించడానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రజారోగ్య డైరెక్టర్ డాక్టర్ బి రవీందర్ నాయక్ తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం ముందు.. ముగిసిన తర్వాత లార్వా నిరోధించడం, ఫాగింగ్, వ్యర్థాలు, డ్రైనేజీలను శుభ్రం చేయాలని చెప్పారు. మున్సిపల్ సిబ్బంది ఈ చర్యలను నిరంతరం నిర్వహించాలన్నారు. ప్రజలు కూడా వర్షాకాలంలో.. డ్రంబుల్లో, కూలర్లలో నీటిని నిల్వ చేయొద్దని చెప్పారు. చికున్ గున్యాను వ్యాప్తి చేసే లార్వా.. ఇలాంటి చోట్లలో తయారవుతుందని చెప్పారు. బృందాలు ఫ్రై డే డ్రై డే అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేస్తున్నాయని తెలిపారు.

**చికున్ గున్యా లక్షణాలు ..**

ఏడిస్ దోమల ద్వారా వైరల్ వ్యాధి అయిన చికున్ గున్యా వ్యాపిస్తుంది. చికున్ గున్యా వస్తే జ్వరం, తీవ్రమైన కీళ్ల నొప్పులు వస్తాయి. తరచుగా తలనొప్పి, కండరాల నొప్పి, చర్మపు దద్దుర్లు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. చికున్ గున్యా రోగుల సంఖ్య గణనీయంగా పెరగడంతో.. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మార్గదర్శకాలు జారీ చేసింది. దోమల నుంచి రక్షించుకోవడానికి సూచనలు చేసింది.

# నగరంలో ప్రపంచ స్థాయి లైబ్రరీ..




హైదరాబాద్: నగరంలోని పుస్తక ప్రియులకు గుడ్‌న్యూస్. నగరంలో ప్రపంచ స్థాయి పబ్లిక్ లైబ్రరీ అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ అంతర్జాతీయ డిజిటల్ సర్వీసెస్, సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన కోఫోర్జ్ లిమిటెడ్ 15 వేల పుస్తకాలతో నగరంలో ఈ పబ్లిక్ లైబ్రరీని ప్రారంభించింది. అత్యాధునిక సదుపాయాలతో అతిపెద్ద లైబ్రరీని అందుబాటు లోకి తీసుకువచ్చారు. నోయిడా , గురుగ్రామ్‌లలో విజయవంతంగా లైబ్రరీలను ప్రారంభించిన కోఫోర్జ్.. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం కింద నగరంలో మూడో మూడో లైబ్రరీని ఏర్పాటు చేసింది.

కొండాపూర్ నివాస ప్రాంతానికి ఆనుకుని.. కొత్తగూడ లోని ప్రణవ బిజినెస్ పార్క్ 8వ అంతస్తులో ఈ లైబ్రరీని ఏర్పాటు చేశారు. 15,660 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ లైబ్రరీలో ఫ్లోర్-టు-సీలింగ్ గ్లాస్ గోడల ద్వారా నగర అందాలను చూడొచ్చు. పూర్తిగా ఎయిర్ కండిషన్ చేయబడిన ఈ లైబ్రరీలో వీల్‌చైర్ వినియోగదారులకు సౌలభ్యంగా ఉండేలా విశాలమైన కారిడార్లు, చిన్నారి విద్యార్థులను ఆకర్షించేలా ప్రత్యేకంగా రూపొందించిన చిల్డ్రన్స్ జోన్ ఉన్నాయి.

ఈ లైబ్రరీలో ఫిక్షన్, థ్రిల్లర్స్, ప్రయాణం, పిల్లల సాహిత్యం, సెల్ఫ్-హెల్ప్, మేనేజ్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పర్యావరణం, కవిత్వం, ఆత్మకథలు, గ్రాఫిక్ నవలలు, రాజకీయాలు వంటి అనేక అంశాలకు సంబంధించిన 15,000కు పైగా పుస్తకాలు ఉంచారు. ఈ జాబితాలో అవార్డులు పొందిన రచయితల పుస్తకాలు, విలువైన రిఫరెన్స్ శీర్షికలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా.. పాఠకులకు సులభంగా సేవలు అందించేందుకు పూర్తిగా డిజిటలైజ్ చేయబడిన కేటలాగింగ్, నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేశారు.


**ఉచిత ప్రవేశం, నిరంతర సేవలు**

ఈ కో ఫోర్జ్ పబ్లిక్ లైబ్రరీ అందరికీ ఉచితంగా అందుబాటులో ఉంటుంది. ఇది సంవత్సరంలో 365 రోజులు, ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటుంది. జ్ఞానానికి ద్వారంగా, వ్యక్తిగత ఎదుగుదలకు ఉత్ప్రేరకంగా, స్థానిక సమాజంలో సమ్మిళిత అభివృద్ధికి మూలస్తంభంగా ఈ లైబ్రరీ ఉపయోగపడుతుందని కోఫోర్జ్ ప్రతినిధులు వెల్లడించారు.

సమాజంలో మానవుల ఎదుగుదలకు లైబ్రరీలు అమూల్యమైన వనరులని, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయని తాము నమ్ముతున్నట్లు కోఫోర్జ్ చీఫ్ బ్రాండ్ అండ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ అనురాధ సెహగల్ తెలిపారు. హైదరాబాద్ ప్రజలకు ఈ అద్భుతమైన సదుపాయాన్ని అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఇది భవిష్యత్తు తరాలకు జీవితకాల అభ్యాసానికి పుణ్యక్షేత్రంగా మారుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# ఆర్‌ఆర్‌ఆర్ భూనిర్వాసితులు కీలక నిర్ణయం..

హైదరాబాద్: రిజినల్ రింగు రోడ్డు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు తమ సమస్యపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు సంచలన నిర్ణయం తీసుకున్నారు. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో వంద మందికి పైగా భూనిర్వాసితులు నామినేషన్లు దాఖలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన కొందరు భూనిర్వాసితులు శనివారం ఈ విషయా న్ని ప్రకటించారు. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీ యాల్లో చర్చనీయాంశంగా మారింది. రీజినల్ రింగు రోడ్డు నిర్మాణంతో తమ భూములను కోల్పోతున్న రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా.. రింగు రోడ్డు అలైన్‌మె ంట్‌ను ప్రస్తుత ఓఆర్‌ఆర్ నుంచి సుమారు 60 కిలోమీటర్ల దూరంలోకి మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులు తాము తరతరాల నుంచి సాగు చేసుకుంటున్న భూముల, ఇళ్లను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రీజినల్ రింగు రోడ్డు పరిధిలోని అన్ని గ్రామాల్లో జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికల్లో భూనిర్వాసితులంతా పెద్ద ఎత్తున నామినేషన్లు వేసి తమ నిరసనను తెలియజేయాలని ప్రణాళికలు రూపొందించారు.



అయితే ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడడంతో ఆందోళనలో ఉన్న రైతులు తమ వ్యూహాన్ని మార్చుకున్నారు. తక్షణమే జరగనున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికను తమ నిరసనను బలంగా వినిపించడానికి ఒక వేదికగా ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. ఈ నియోజకవర్గంలో వంద మందికి పైగా భూనిర్వాసితులు నామినేషన్లు వేయడం ద్వారా తమ సమస్య తీవ్రతను రాష్ట్ర,జాతీయ స్థాయి దృష్టికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భూనిర్వాసితులు ఏకకాలంలో ఇంత పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేయడానికి సిద్ధమవుతుండటం రాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి ఒక సవాలుగా మారే ఛాన్స్ ఉంది. ఈ పరిణామం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. రైతుల సమస్యపై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుంది. ఈ నామినేషన్ల ప్రక్రియను ఎలా ఎదుర్కొంటుందనేది ప్రస్తుతం ఉత్కంఠగా మారింది. భూనిర్వాసితుల ఈ నిరసన చర్య, పరిహారం, అలైన్‌మెంట్ మార్పు వంటి తమ ప్రధాన డిమాండ్లను నెరవేర్చుకునే దిశగా ప్రభుత్వానికి ఒక గట్టి సందేశాన్ని పంపనుంది.

# జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్‌కు షాక్.. బరిలోకి టీఆర్‌ఎస్ పార్టీ..!

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సమయం దగ్గరపడు తున్నాకొద్దీ రాష్ట్రంలో రాజకీయం వేడెక్కుతోంది. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్.. గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. ప్రత్యర్థిని చిత్తు చేసేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. దీంతో ఆయన భార్య మాగంటి సునీత గోపీనాథ్‌ను అభ్యర్థిగా ప్రకటించింది బీఆర్‌ఎస్. ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. అంత సాఫీగా సాగుతున్న సమయంలో బీఆర్‌ఎస్‌కు ఇప్పుడు కొత్త చిక్కు వచ్చి పడింది. జూబ్లీహిల్స్ బరిలో తెలంగాణ రక్షణ సమితి- డెమొక్రటిక్ (టీఆర్‌ఎస్-డీ) అనే పార్టీ బరిలోకి దిగింది. దీంతో బీఆర్‌ఎస్‌కు డ్యామేజ్ జరుగుతుందా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్‌కు షాక్ ఇచ్చింది టీఆర్‌ఎస్- డీ పార్టీ. ఈ ఉప ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని టీఆర్‌ఎస్- డీ పార్టీ అధ్యక్షుడు నరాల సత్యనారాయణ వెల్లడించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్లో పార్టీ జెండాతో పాటు వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా లోగో రూపకల్పన చేశామని తెలిపారు. టీఆర్‌ఎస్- డీ కొత్త జెండా.. తెలంగాణ ప్రతిబింబం అని అన్నారు. కాగా, జూబ్లీహిల్స్‌లో తమ అభ్యర్థిగా.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచర్ల మంజూష పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ గట్టి పోటీ ఇస్తుందని నరాల సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు.

**గులాబీ దళంలో టెన్షన్..**

జూబ్లీబిల్స్ ఉపఎన్నికల్లో టీఆర్‌ఎస్- డీ పార్టీ ఎంట్రీతో రాజకీయం రసవత్తరంగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గట్టి పోటీ ఇస్తున్నారు. ఇప్పుడు టీఆర్‌ఎస్ కూడా రావడంతో.. బీఆర్‌ఎస్ పార్టీలో గుబులు మొదలైంది. ఎందుకంటే.. టీఆర్‌ఎస్ పార్టీ జెండా, పేరు ఒకేలా ఉండటం పార్టీ శ్రేణులను కలవర పరుస్తోంది. చాలా మంది ఓటర్లకు బీఆర్‌ఎస్ కంటే ఎక్కువగా టీఆర్‌ఎస్ అనే తెలుసు. ఇక టీఆర్‌ఎస్- డీ జెండా కూడా గులాబీ రంగులో ఉండటంతో.. ఓటర్లు తికమక పడే అవకాశం ఉంది. గతంలో కారును పోలిన రోడ్డు రోలర్, రోటీ మేకర్ సింబల్స్‌తో స్వతంత్ర అభ్యర్థులు బరిలోకి దిగితే.. గులాబీ ఓటుబ్యాంకుకు గండి పడిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూడా అలా జరిగి ఓట్లు చీలితే.. బీఆర్‌ఎస్‌కు నష్టం తప్పదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఒక వేళ టీఆర్‌ఎస్ పార్టీకి.. కారును పోలిన గుర్తు కేటాయిస్తే.. నష్టం తప్పదని అంటున్నారు. దీంతో ఈ ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్-డీ పార్టీ ఏ మేర ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

# కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు షురూ..

సికింద్రాబాద్: ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీంగ్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) ఇంటర్‌ఛేంజ్ వరకు ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి ఎట్టకేలకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నెల 29న నోటిఫికేషన్‌ను జారీ చేయడానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) సన్నద్ధమైంది. ఈ ప్రాజెక్టుకు అతిపెద్ద అడ్డంకిగా ఉన్న కీలకమైన రక్షణ శాఖ భూముల అప్పగింత ప్రక్రియ ఒక కొలిక్కి రావడంతో టెండర్ల అనంతరం నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి. ప్యారడైజ్ నుంచి రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే డైయిరీఫాం కారిడార్ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు శామీర్‌పేట కారిడార్‌కు టెండర్లు పిలవనున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే ఉత్తర తెలంగాణ వైపు ప్రయాణించే వాహనదారులకు భారీ ఊరట లభిస్తుంది. ముఖ్యంగా, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ వంటి జిల్లాల వైపు రాకపోకలు సాగించే వారికి ట్రాఫిక్ ఇబ్బందులు పూర్తిగా తొలగిపోనున్నాయి. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్ నుండి శామీర్‌పేట వరకు సిగ్నల్-రహిత ప్రయాణం సాధ్యమవుతుంది, తద్వారా సమయం గణనీయంగా ఆదా అవుతుంది.



ఈ శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్ ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట ఓఆర్‌ఆర్ ఇంటర్‌ఛేంజ్ వరకు 18.10 కిలోమీటర్ల దూరం విస్తరించి ఉంటుంది. ఈ భారీ నిర్మాణానికి సుమారు 197 ఎకరాల భూమి అవసరం కాగా.. ఇందులో 113.48 ఎకరాల భూమి రక్షణ శాఖకు సంబంధించి నది. భూ పరిహారం వ్యయంతో సహా ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం దాదాపు రూ. 3,619 కోట్లుగా నిర్ణయించారు.

నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ కారిడార్ నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ ఉత్తర ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వతంగా చెక్ పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కేవలం ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాకుండా, నగర మౌలిక సదుపాయాల అభివృద్ధికి, చుట్టుపక్కల ప్రాంతాల ఆర్థిక వృద్ధికి కూడా దోహదపడుతుంది.

# సజ్జనార్ మార్క్ పోలీసింగ్..

**ఉత్తమ పోలీసులకు ప్రతివారం రివార్డులు..**



హైదరాబాద్: దాదాపు నాలుగేళ్ల పాటు ఆర్టీసీ ఎండీగా సేవలం దించిన వీసీ సజ్జనార్‌ను.. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే. బాధ్యతలు చేపట్టిన వెంటనే వీఐపీలకు వార్నింగ్ ఇచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ప్రమోషన్ చేయొద్దని హెచ్చరిం చారు. నగరంలో డ్రగ్స్ కట్టడికి కూడా ప్రయత్నా చేస్తామని చెప్పారు. చెప్పినట్లుగానే సీపీ సజ్జనార్ తన మార్క్ పోలీసింగ్ చూపిస్తున్నారు. అందులో భాగంగా ' ఎక్స్‌ట్రా మైల్ రివార్డ్ ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మానవతా దృక్పథంతో పనిచేస్తూ.. ప్రజల మన్ననలు పొందే సిబ్బందిని ప్రోత్సహించేం దుకే ఈ ప్రోగ్రాం ప్రారంభిస్తున్నట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత శనివారం తొలిసారిగా అన్ని విభాగాలతో వర్చువల్ గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోనే హైదరాబాద్ కమిషనరేట్ చాలా పురాతనమైనదని చెప్పారు. అలాంటి కమిషనరేట్ ప్రతిష్ఠను మరింత పెంచాలని అన్నారు. అందుకే పోలీసులు ప్రజలకు మెరుగైన సేవలు అందించేం దుకు.. సలహాలు, సూచనలు జారీ చేశారు సజ్జనార్.

ఎక్స్‌ట్రా మైల్ రివార్డ్ ప్రోగ్రాంలో భాగంగా ప్రతి శనివారం ఉత్తమ పని తీరు కనబర్చిన సిబ్బందిని గుర్తిస్తారని సీపీ చెప్పారు. ఎంపిక చేసిన వారికి ప్రశంసాపత్రం, రివార్డుతో సన్మానిస్తారన్నారు. హైదరాబాద్‌ను డ్రగ్స్ రహిత నగరంగా మార్చడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ కేసుల్లో లోతుగా విచారణ జరిపి.. దోషులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని చెప్పారు.

**ఉత్తమ పోలీసులకు సీపీ ప్రశంసలు..**

ఈ సమావేశం సందర్భంగా ఇటీవల ఉత్తమ పనితీరు కనబర్చిన పోలీసులను వీసీ సజ్జనార్ ప్రశంసించారు. ఇటీవల మాదన్నపేటలో జరిగిన చిన్నారి హత్య కేసును.. ఛేదించడంలో వ్యవహరించిన ఎస్సైలు సుధాకర్, శోభ, సాయికాంత్, శివకుమార్‌తో పాటు ఇతర సిబ్బందిని సజ్జనార్ అభినందించారు. ఇక నిరాశ్రయులను ఆదరించి ఆశ్రమానికి తరలించిన అఫ్జల్‌గంజ్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రవి, ఎస్‌ఐ నిరంజన్, ఏఎస్‌ఐ ధర్మేందర్‌ను ప్రశంసించారు. ఓ కేసులో 30 ఏళ్ల తర్వాత నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ విజయ సుధాకర్, కానిస్టేబుల్ సురేందర్‌ను కూడా వీసీ సజ్జనార్ ప్రశంసించారు.



# మరో ఎయిర్ పోర్ట్.. 591.24 ఎకరాలలో..

తెలంగాణ: రాష్ట్రంలో ప్రాంతీయ వైమానిక అనుసంధానం పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని అంతర్గాం వద్ద ప్రతిపాదిత ప్రాంతీయ విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనం చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తొలుత ఈ ప్రాజెక్టును బసంత్‌నగర్‌లో నిర్మించాలని యోచించినా.. అక్కడ గుర్తించిన స్థలంపై చేసిన సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల నివేదిక అనుకూలంగా రాలేదు. దీంతో ప్రత్యామ్నాయంగా అంతర్గాంలో 591.24 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం ఈ కొత్త స్థలంపై సమగ్రమైన నివేదికను సిద్ధం చేసే బాధ్యతలను కన్సల్టెన్సీకి అప్పగించారు.

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఇతర విమానాశ్రయాలు..

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పారిశ్రామిక, పర్యాటక, వాణిజ్య రంగాల వృద్ధి కోసం ప్రధాన నగరాలకు వైమానిక అనుసంధానాన్ని పెంచడానికి బహుళ విమానాశ్రయాల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోంది. చారిత్రక వరంగల్ నగరానికి సమీపంలో ఉన్న మమ్నూరు వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించిన చర్యలు ఇప్పటికే ముమ్మరమయ్యాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఐటీ కారిడార్ వంటి ముఖ్య ప్రాజెక్టులు ఉన్నందున, వరంగల్‌లో ఎయిర్‌పోర్టు ప్రాంతీయ అభివృద్ధికి కీలకం కానుంది. రాష్ట్ర ఉత్తర భాగంలో ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో కూడా ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రతిపాదనలు ఊపందుకున్నాయి. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం వలన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు చెందిన ప్రజలకు, వ్యాపారాలకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుంది. రాష్ట్ర ముఖ్య పట్టణాలలో విమానాశ్రయాలను నిర్మించడం వల్ల పెట్టుబడులు పెరగడంతో పాటు.. ప్రాంతీయ అసమానతలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. ఈ ప్రాంతీయ విమానయాన కేంద్రాలు వ్యాపార విస్తరణకు, పర్యాటక రంగం అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయి. అంతర్గాంలో విమానాశ్రయం ఏర్పాటైతే.. ఇది ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చడంతో పాటు.. సింగరేణి, ఇతర పరిశ్రమల అవసరాలను తీర్చనుంది.

# సైబర్ నేరాలపై పోలీసుల ఉక్కుపాదం..




తెలంగాణ: సైబర్ నేరాలపై తెలంగాణ కఠిన వైఖరి అవలంభిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో మొట్ట మొదటి సారిగా ఓ సైబర్ నేరస్థుడిపై ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ ప్రయోగించారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ పీడీ యాక్ట్ కేసు నమోదైంది. హైదరాబాద్‌లోని జీడిమెట్ల కు చెందిన కోలనాటి నాగశివ (36) అనే యువకుడిపై ఈ కేసు సీపీ పోతరాజు సాయిచైతన్య తెలిపారు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా.. పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం నిందితుడిని చెంచల్‌గూడ జైలుకు తరలించినట్లు వెల్లడించారు. సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు సీపీ సాయి చైతన్య. ఈ మేరకు ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు.

**ఉద్యోగాలు ఇప్పిస్తానని..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని కొంత మంది నిరుద్యోగ యువతకు కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నాగశివ నమ్మబలికాడు. అనంతరం వారిని లావోస్, థాయిలాండ్ దేశాలకు పంపించేవాడు. అక్కడికి వెళ్లిన తర్వాత వారి పాస్ పోర్టులు స్వాధీనం చేసుకుని చట్ట విరుద్ధమైన సైబర్ మోసాలకు పాల్పడేలా బలవంతంగా పని చేయించేవాడు. ఈ కేసులో నాగశివ ప్రధాన నిందితుడని పోలీసులు తెలిపారు.

ఈ సైబర్ గ్యాంగ్ అంతర్జాతీయ స్థాయిలో నేరాల చేస్తోందన్నారు. గ్యాంగ్‌కు సూత్రధారి అయిన కోలనాటి నాగశివపై సెప్టెంబర్ 13న పీడీ యాక్టు-1986 చట్టం, కింద అరెస్ట్ చేసి.. చంచల్ గూడా జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి జారీ చేసిన పీడీ యాక్ట్ ఆర్డర్‌కు తెలంగాణ ప్రభుత్వం కన్ఫర్మేషన్ ఇస్తుందని సీపీ సాయి చైతన్య వెల్లడించారు.

**అలాంటి వారిపై కఠిన చర్యలు..**

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని సీపీ సాయిచైతన్య వార్నింగ్ ఇచ్చారు. చట్టవ్యతిరేక కార్యకలాపా లకు పాల్పడుతున్న వారు ఎవరైనా.. ఎంతటి వారైనా వదిలిపెట్టమని వార్నింగ్ ఇచ్చారు. మట్కా, గుట్కా, గ్యాంబ్లింగ్ వంటి నేరాలతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారు తమ పద్ధతులను మార్చుకోవాలని హెచ్చరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి.. పౌరులు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు సీపీ. ప్రస్తుతం.. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని గల అన్ని పోలీస్ స్టేషన్లలో నేరస్థుల వివరాలను బయటకు తీయాలని సీపీ సాయి చైతన్య ఆదేశాలు జారీ చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిని.. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని, శాంతికి భద్రతలకు భంగం కలిగించే వారి కదలికలపై నిఘా పెట్టామని వెల్లడించారు. రానున్న రోజుల్లో అలా వ్యవహరించే వారిని కూడా.. పీడీ యాక్ట్ కిందికి తీసుకు వస్తామని హెచ్చరించారు.

# తెల్లబట్టలపై మరకలు పోతాయ్..







తెల్ల బట్టలు వేసుకోవడానికి ఎంత బావుంటాయో.. వాటిని మెంటెయిన్ చేయడం కూడా అంతే కష్టం. ముఖ్యంగా కాలర్, అండర్ ఆర్మ్స్ మీద మరకలు అలానే ఉండిపోతాయి. ఏం చేస్తే ఈ మరకలు పోతాయో అస్సలు తెలియవు. అందుకే ఇప్పుడు చెప్పే ఈ టిప్స్‌తో సమస్యని దూరం చేసుకోండి. వైట్ క్లాత్స్‌పై ఏ చిన్న మరక పడినా అది వదలడం చాలా కష్టం. అందుకే వాటిని సెపరేట్‌గా ఉతకండి. ఇతర బట్టలతో కలిపి ఉతకొద్దు. ఎందుకంటే, వాటి రంగులు తెల్ల బట్టలకి అంటుకుని మొండి మరకల్లా మారతాయి. వీటిని కెమికల్స్‌తో నిండిన సబ్బు, డిటర్జెంట్ లిక్విడ్స్‌తో రుద్దితే ఉన్న తెల్లదనం తగ్గిపోతుంది. తెల్లని బట్టల్ని ఎక్కువసేపు ఎండలో ఆరబెట్టొద్దు. కొద్దిసేపు ఆరబెడితే చాలు. ఎక్కువగా వేడి ఉన్న ప్రాంతంలో ఆరేస్తే కలర్ చేంజ్ అవుతాయి. కాబట్టి, అలా చేయకండి. చాలా మంది బట్టలకి బ్లీచ్ వాడుతుంటారు. వీటిని వాడాలనుకుంటే కాటన్ వాటికి వాడండి. అన్ని బట్టలకు వద్దు. వీటిని వాడడం వల్ల బట్టలు పాడయ్యే అవకాశం ఉంది. చాలా మంది బట్టలు తెల్లగా మారాలని ఎక్కువగా సబ్బు వాడతారు. దీని వల్ల తెల్ల బట్టలపై మురికి పోతుంది. కానీ, తెలుపుదనం తగ్గుతుంది. కాబట్టి, కొద్దిగా మాత్రమే సబ్బుని వాడండి. నీలిరంగు.. ఆప్టికల్ బ్రైటెనర్స్‌ని పిలిచే నీలిరంగుని వాడతారు. వీటిని వాడితే బట్టలు తెల్లగా మారతాయి. ఈ బ్లూయింగ్ ఏజెంట్‌ని వాషింగ్ మెషిన్‌లో డిటర్జెంట్ డిస్పెన్సర్‌కి జోడించవచ్చు. నిమ్మరసం.. నిమ్మరసం కూడా తెల్ల బట్టలపై మరకల్ని ఈజీగా దూరం చేస్తుంది. ఇందులోని బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఇది తెల్లని బట్టలపై మురికిని దూరం చేస్తుంది. ఇందుకోసం ముందు రోజు నిమ్మకాయ రసాన్ని మరకలపై రాసి వేడి నీటిలో నానబెట్టండి. హైడ్రోజన్ పెరాక్సైడ్.. అదే విధంగా, డిటర్జెంట్‌కి హైడ్రోజన్ పెరాక్సైడ్‌ని కలపండి. తెల్లని బట్టల కాలర్లు, అండర్ ఆర్మ్స్ ప్రాంతాల్లోని మురికిని దూరం చేసేందుకు వాడొచ్చు. ఇలా చేయడం వల్ల చాలా వరకూ మరకలు దూరమవుతాయి.




# ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే...




సమ్మర్‌లో కూరగాయలు, పండ్లు త్వరగా వాడిపోతాయి. అలా కాకుండా ఉండాలంటే వీటిని ఎలా స్టోర్ చేసుకోవాలో తెలుసుకోండి. సాధారణంగా చాలా మంది ఫ్రిజ్‌లో పండ్లు, కూరగాయలు పెడుతుంటారు. ఎందుకంటే ఫ్రిజ్‌లో వీటిని పెడితే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. కానీ, కొన్నిసార్లు పండ్లు, కూరగాయల్ని ఫ్రిజ్‌లో పెట్టినా పాడవుతుంటాయి. దీనికి కారణాలు ఏంటి. ఎందుకిలా త్వరగా పాడవుతాయి. అన్నింటిని ఒకేదగ్గర వద్దు.. కూరగాయలు, పండ్లలో చాలా ఎంజైమ్స్ ఉంటాయి. వీటిని అన్నింటిని ఒకేదగ్గర పెడుతుంటారు చాలా మంది. దీంతో కొన్ని కూరగా యలు, పండ్లు ఇథలీన్‌ని ఉత్పత్తి చేస్తాయి. దాంతో అవి త్వరగా కుళ్ళిపోతాయి. అటువంటి కూరగాయలు, పండ్లని ఎలా స్టోర్ చేయాలో తెలుసుకోండి. క్యాబేజీ.. క్యాబేజీ కూడా తాజాగా ఉండాలంటే స్వచ్ఛమైన గాలి అవసరం. అందుకే, యాపిల్స్, పుచ్చకాయలు, కివీస్ వంటి పండ్లతో వీటిని కలిపి పెట్టొద్దు. ఇవన్నీ కూడా ఇథలీన్‌ని రిలీజ్ చేసే పండ్లు. కాబట్టి, వీటికి దూరంగా ఉంచి స్టోర్ చేయడం అవసరం. సోరకాయతో వద్దు.. సోరకాయ, పొట్లకాయ వంటి కూరగాయల్ని యాపిల్, ద్రాక్ష, అంజీర్ వంటి పండ్లతో కలిపి ఒకే దగ్గర స్టోర్ చేయొద్దు. ఎందుకంటే ఇవి కూడా ఇథలీన్‌ని రిలీజ్ చేస్తాయి. దీంతో త్వరగా పాడవుతాయి.బ్రకోలీతో ఫ్రూట్స్ వద్దు.. బ్రకోలీతో ఫ్రూట్స్ వద్దు.. బ్రకోలీకి ఇథలీన్ పడదు. కాబట్టి.. మీరు దీనిని ఆపిల్, అత్తి, ద్రాక్ష పండ్ల వంటి ఇథలీన్ ఉత్పత్తి చేసే పండ్లతో బ్రకోలీని పెడితే అది త్వరగా పాడవుతుంది. అందుకే వాటిని ఈ పండ్లతో కలిపి పెట్టొద్దు.. ఆకుకూరలతో ఇవి వద్దు.. ఆకు కూరలు తాజాగా ఉండాలంటే వాటిని సెపరేట్‌గా ప్యాక్ చేసి పెట్టాలి. వీటికి దగ్గర్లో పుచ్చకాయ, ద్రాక్ష, యాపిల్స్ వంటి ఇథలీన్ రిలీజ్ చేసే పండ్లతో కలిపి పెట్టొద్దు. దీని వల్ల ఆకుకూరలు త్వరగా పాడవుతాయి. అందుకే వీటికి సెపరేట్‌గా పెట్టండి.

# గులాబీ మొక్కకి పూలు ఎక్కువ పూయాలంటే...

వర్షాలు మొదలయ్యాయి. ఈ సమయంలో చాలా మంది మొక్కలు పెడుతుంటారు. పూ మొక్కలు అంటే చాలా మందికి ఇష్టం. ఇందులో గులాబీలు ప్రత్యేకం. మరి ఆ చెట్లకి పువ్వులు ఎక్కువగా పూయాలంటే ఏం చేయాలి.

గులాబీ మొక్కకి పూలు ఎక్కువ పూయాలంటే ఇలా చేయండి.. కొంతమంది మొక్కలు పెంచుతారు. అలాంటప్పుడు కొన్ని పొరపాట్లు కూడా ఉంటాయి.



అలానే గులాబీ మొక్కలు పెంచేటప్పుడు కూడా కొన్ని తప్పులు చేస్తుంటారు. మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే మనం కొన్ని విషయాలు పాటించాలి. అప్పుడే అవి ఎక్కువ పూలు పూస్తాయి. అవేంటో ఇప్పుడు చూద్దాం. కొనేటప్పుడు.. మీరు గులాబీ మొక్కను కొనేటప్పుడు ఆల్రెడీ పూలు ఉంటే వాటిని తీసి వేయండి. అప్పుడే కొమ్మలు మాత్రమే పెరుగుతాయి. గులాబీ మొగ్గలు వస్తాయి. కాబట్టి, కొనేటప్పుడు ఏమైనా పూలు వుంటే తీసేయండి. ఎక్కడ నాటాలి.. గులాబీ మొక్కల్లో చాలా రకాలు ఉన్నాయి. కాబట్టి, మనం ఏది కొంటున్నామో కూడా తెలుసుకోవాలి. గులాబీలను వెలుతురు ఉన్న ప్రదేశంలో పెట్టాలి. రెగ్యులర్‌గా ప్లేసెస్ మార్చొద్దు. తర్వాత దీనికి మంచి కంపోస్ట్ రిచ్ మట్టిని వాడాలి. కనీసం





రెండు అడుగుల లోతులో గులాబీలను నాటండి. మీరు కంపోస్ట్, మట్టిని కలిపి వాడొచ్చు.

నీరు పోయడం.. గులాబీలకు నీరు పోయడం కూడా చాలా ముఖ్యం. పొడి వాతావరణంలో నీరు సరిగ్గా పట్టాలి. నీరు పోసేటప్పుడు ఆకులపై నీరు పడకుండా చూడాలి.

వేప మిశ్రమం.. గులాబీ మొక్కలు ఆరోగ్యంగా ఉండాలంటే మట్టితో పాటు వేప పొడి కలిపి గులాబీ మొక్కలు నాటాలి. ఇది ఎక్కువగా ఎరువుల దుకాణాల్లో దొరుకుతుంది ఇలా నాటితే పురుగులు పట్టకుండా మొక్కలు ఆరోగ్యంగా ఉంటాయి. రాలుతున్న పూలు.. ఎప్పటికప్పుడు రాలే పూలను తీసేయాలి. దీని వల్ల కొత్త పూలు వస్తాయి. గులాబీలు వసంతకాలం నుండి చివరి శరదృతువు వరకు వికసిస్తాయి. వాటిని చూసినప్పుడల్లా రాలుతున్న పూలని తీసేయాలి.

పురుగు మందులు.. అదే విధంగా, గులాబీ మొక్కలకి బయట దొరికే పురుగు మందులు బదలు ఇంట్లోనే కొన్ని సహజ క్రిమి సంహారకాలు తయారు చేయొచ్చు. అందుకోసం వేపాకులు తీసుకుని అందులో వెల్లుల్లి తొక్క వేసి మొత్తగా మిక్సీ పట్టి ఈ మిశ్రమాన్ని ఫిల్టర్ చేసి స్ప్రే బాటిల్‌లో వేయాలి. దీనిని స్ప్రే చేస్తుంటే చీడపీడలు, కీటకాలు, చీమలు వదులుతాయి.



# పిల్లల గది ఇలా డిజైన్ చేస్తే..



పిల్లల రూమ్ డిజైన్ చేయడం.. తల్లిదండ్రులకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. పిల్లలకు నచ్చేలా, వారి ఇష్టాలకు అనుగుణంగా రూమ్ డిజైన్ చెయ్యాలనుకుంటారు. పిల్లల రూమ్ ఎలా డిజైన్ చేయాలో ఈ స్టోరీలో చూద్దాం. తల్లిదండ్రులకు ఎప్పుడూ ఎగ్జైటింగ్‌గానే ఉంటుంది. పిల్లల గది డిజైన్ చేయడం అంత ఈజీ కాదు. పిల్లలకు ఏమి ఇష్టం, ఆసక్తి, వారి ఆలోచనలను దృష్టిలో ఉంచుకుని వారి గదిని అలంకరించాలి. చిన్నారుల్లో సృజనాత్మక శక్తిని మేల్కొలిపేలా, ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించేలా వాళ్ల గది డిజైనింగ్ ఉండాలి. పిల్లలకు అదే ప్రపంచం.. ఆ గదిలోనే ఆడతారు, చదువుకుంటారు, నిద్రపోతుంటారు. పిల్లల రూమ్ డిజైన్ చేసేప్పుడు.. గుర్తుపెట్టుకోవలసిన ముఖ్యమైన విషయాలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం. పిల్లలు ఎక్కువగా ముదుర రంగులను ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. వారి రూమ్‌లో ఒకే గోడకు ముదురు రంగులు వేయించండి. మానసిక శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం చిన్న పిల్లలు ఎరుపు, నీలం, పసుపు రంగులను ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. ఇవి కాకుండా ఆకుపచ్చ, పర్పుల్ కూడా వారికి నచ్చుతాయి. మొత్తం అంతా ఒకే రంగు కాకుండా గదిలో వేర్వేరు చోట్ల వేర్వేరు రంగులను వేయించండి. ఒక గోడ మీద కార్టూన్‌లు, బొమ్మలు, వాళ్ల ఫేవరెట్ కార్టూన్, కథల్లోని పాత్రలను గోడ మీద వేయించవచ్చు. కార్టూన్లు, బొమ్మలతో వాల్‌పేపర్లు వస్తున్నాయి. వాటిని గోడమీద అంటించొచ్చు. ప్రయాణాలంటే ఇష్టపడుతున్నా, వారిలో అటువంటి ఆలోచనలు తేవాలన్నా ప్రపంచ పటం వాల్‌పేపర్‌గా ఉంటే బావుంటుంది. స్టార్స్, ట్రైయాగిల్స్, సర్కిల్ లాంటి పిల్లలకు స్పషల్‌గా ఉంటాయి.




చిన్నారుల కోసం ఫర్నీచర్, మంచం లాంటివి కొనేప్పుడు ఆకారాల్లో, రంగుల్లో ఆకర్షణీయంగా, భిన్నంగా ఉండేట్టు చూడాలి. బెడ్ అందంతో పాటు పిల్లల భద్రత, సౌకర్యాలకు కూడా ప్రాధాన్యమివ్వాలి. పిల్లల పరుపు మరీ గట్టిగా ఉండకుండా చూసుకోవాలి. కొద్దిగా మెత్తగా ఉంటే పిల్లలు ఇష్టపడతారు. ఎక్కువ మంది పిల్లలు ఉన్నట్లయితే ప్లేస్ అడ్జెస్ట్‌మెంట్ చాలా ముఖ్యం. ఈ పరిస్థితి ఉంటే.. బంక్ బెడ్‌లు, ట్రండల్ పుల్ అవుట్ బెడ్‌లు ఎక్కువ స్థలాన్ని ఆక్రమించవు. కొన్ని ఫర్నిచర్ ఐటెమ్‌లలో, డ్రాయర్‌లను బంక్ బెడ్ మెట్లలోకి నిర్మించవచ్చు స్టడీ ఎసెన్షియల్‌లను స్టోర్ చేయడానికి వీటిని ఉపయోగించవచ్చు.

పిల్లలు చదువుకోవడానికి ఓ మూల టేబులు, చైర్ ఎరేంజ్ చెయ్యాలి. మంచంలోనే చాక్‌బోర్డులను ఏర్పాటు చేసుకోవడం ఇప్పటి పిల్లల గదుల ప్రత్యేకత. పిల్లలు యాక్టివ్‌గా ఉంటారు. వాళ్ల గదిలోనే అటూ ఇటూ తిరుగుతూ ఆడుతూ ఉంటారు. వాళ్ల సేఫ్టీని దృష్టిలో ఉంచుకుని రూమ్ డిజైన్ చేయడం మంచిది. ఫర్నిచర్ స్ట్రాంగ్‌గా, క్వాలిటీగా ఉండేలా చూసుకోవాలి. ఫర్నిచర్ అంచులు గుండ్రంగా ఉండాలి. రాత్రిళ్లు నిద్రపోయే ముందు లైట్స్ ఆఫ్ చేస్తే పిల్లలు కొత్తలో భయపడతారు. చీకట్లో కూడా మెరిసేలా సీలింగ్‌కు మెటాలిక్ రంగులు వేస్తే చీకట్లోనూ భయం లేకుండా నిద్రపోతారు. పిల్లల గదిలో కంటికి శ్రమ కలిగించని ఫ్లోరోసెంట్ బల్బులను వాడాలి.

# ఏసి కచ్చితంగా రిపేర్ చేయించాలి..

ఎండాకాలంలో చాలా మంది ఏసీలు వాడుతుంటారు. వీటిని ఎప్పటికప్పుడు జాగ్రత్తగా మెంటెయిన్ చేయాలి. లేకపోతే దీనిని ఆస్వాదించలేం. కొన్ని ప్రాబ్లమ్స్ వచ్చినప్పుడు వాటిని గుర్తించి రిపేర్ చేస్తే మంచి కూలింగ్ ఫీల్‌ని పొందగలం. అవేంటో ఇప్పుడు చూద్దాం. వేడి గాలి వచ్చినప్పుడు.. చాలా మంది ఏసీలను ఆస్వాదించాలనుకుంటారు వీటిని కొన్న కొత్తలో చల్లగా ఊటీలోనో, కొడైకెనాల్‌లోనో ఉన్నట్లుగా అనిపిస్తుంది. కానీ, రోజులు గడిచేకొద్దీ ఏసీ నుంచి వేడి గాలి వస్తుంటుంది. అలాంటప్పుడు ఏం చేయాలంటే.. ఏసి టెంపరేచర్‌ని రూమ్ టెంపరేచర్ కంటే తక్కువగా సెట్ చేయండి. అయినా వేడి గాలి వస్తుంటే ఓ సారి రిపేర్ చేయించడం మంచిది. గాలి రాకపోతే.. అదే విధంగా కొన్నిసార్లు సరిగ్గా గాలి రాదు. వెంటిలేషన్ లేకపోతే ఇలా జరుగుతుంది. మీ ఏసీ కెపాసిటీ సరిగ్గా లేకపోతేనే ఇలా అవుతుంది. కాబట్టి, ఓ సారి సర్వీసింగ్ చేయించడం మంచిది. దీని వల్ల ఏసి సరిగ్గా పనిచేస్తుంది. దీంతో పాటు కొంతమంది ఏసీలు ఆన్ చేసినప్పుడు ఎక్కువగా సౌండ్ వస్తుంటుంది. అలా రాకుండా ఉండాలంటే కచ్చితంగా ఓ సారి ఏసీ రిపేర్ చేయించాల్సిందే.. ఎక్కువగా చలిగా అనిపించినప్పుడు.. సాధారణంగా రూమ్ టెంపరేచర్ చల్లగా ఉంచేందుకే ఏసీలను వాడుతుంటారు. వీటికి అనుగుణంగానే ఏసీలు వాడినప్పుడు రూమ్ టెంపరేచర్ చల్లగా అయితే, ఆపరేటింగ్ సిస్టమ్ దానంతట అదే ఆఫ్ అవుతుంది. అలా జరగకుండా రూమ్‌లో ఇంకా చల్లదనం పెరుగుతుంటే కచ్చితంగా దీనిని రిపేర్ చేయించడం మంచిది. నీరు కారడం.. ఇది కూడా ఓ ముఖ్య కారణం. ఏసీ నుంచి నీరు కారడం కరెక్ట్ కాదు. ఇది ఏసి కండిషనింగ్ యూనిట్ ప్రాబ్లమ్, కాబట్టి, ఇలా జరిగినప్పుడు కూడా వెంటనే ఏసిని రిపేర్ చేయించడం బెస్ట్. దుర్వాసన వస్తుంటే.. ఏసీ వాడినప్పుడు వాసన కొద్దిగా తేడా వస్తుందా.. అయితే దీనికి కారణం సిస్టమ్ సరిగ్గా పనిచేయకపోవడం. కాబట్టి, ఈ టైమ్‌లో కూడా వెంటనే రిపేర్ చేయించాలి. రూమ్ మొత్తం ఒకే టెంపరేచర్.. అదే విధంగా ఏసీ ఆన్ చేసినప్పుడు రూమ్ మొత్తం ఒకే టెంపరేచర్ ఉండాలి. అంతేకానీ, ఒక్కో చోట ఒక్కో టెంపరేచర్ ఉంటే ఆపరేటింగ్ సిస్టమ్‌లో ప్రాబ్లమ్ ఉన్నట్లే. కాబట్టి, ఆ సమయం లో కచ్చితంగా ఏసి రిపేర్ చేయించాల్సిందే. కరెంట్ బిల్ ఎక్కువగా రావడం.. అదే విధంగా, ఏసి వాడినప్పుడు సాధారణంగా కరెంట్ బిల్ ఎక్కువగా వస్తుంటుంది. ఇది సాధారణమే కానీ, మొదట్లో వాడినప్పుడు తక్కువగా వచ్చి రానురాను ఎక్కువగా వస్తే.. కచ్చితంగా రిపేర్ చేయించాల్సిందే.



# మిక్సీలో అల్లం రుబ్బుతున్నారా..





అల్లం, మసాలాలు, కొబ్బరి తురుము, ఇడ్లీ, దోశ పిండి ఇలా ఏవైనా సరే ప్రిపేర్ చేయడానికి మిక్సీని ఎక్కువగా వాడతారు. అన్ని అవసరాలకి అనుగుణంగా మిక్సీలను వాడుతుంటారు. అందులో కూరగాయలు కట్ చేయడం, చపాతీ పిండిని కలిపేందుకు కూడా డిజైన్ చేస్తున్నారు. దీంతో చాలా మంది వీటిని వాడుతూ ఆ విధంగానే తమ పనని ఈజీ చేసుకుంటున్నారు. కానీ, ఇలా చేసేటప్పుడు కొన్నింటిని గమనించాలని చెబుతున్నారు నిపుణులు. చపాతీ పిండి.. చాలా మంది పిండిని కలిపేందుకు కూడా మిక్సీలను వాడుతుంటారు. దీనికోసం ప్రత్యేకంగా అట్టా నీడర్ ఉంటుంది. అందుకోసం వేసి పిండిని మెత్తగా కలుపుతారు. కానీ, పిండి త్వరగానే కలిసిపోతుంది. కానీ, చేతితో కలిపినట్లుగా ఉండదు. దీనివల్ల చపాతీలు కూడా బాగా రావు. కాబట్టి, చేతితో కలపడం మంచిది. వేడి వేడి ఫుడ్స్.. వేడి వేడి ఫుడ్స్.. అదే విధంగా కొన్నింటిని ఫ్రై చేసి అవి వేడిగా ఉండగానే మిక్సీలో వేస్తారు చాలా మంది. అలా ఎప్పుడు చేయకూడదు. దీని వల్ల జార్ త్వరగా పాడవుతుంది. అంతేనా, విరిగిపోతుంది కూడా. అలా కాకుండా వాటిని కాస్తా గోరువెచ్చగా అయ్యేవరకూ ఉండి ఆ తర్వాత వాటిని మిక్సీ పట్టాలి. అల్లం వెల్లుల్లి.. అల్లం వెల్లుల్లిని చాలా మంది మిక్సీ జార్‌లోనే వేస్తారు. ఇది అందరూ చేసేదేగా ఎందుకు వద్దు అనుకుంటున్నారా.. వీటిని ఎక్కువ పరిమాణంలో చేస్తే త్వరగా అయ్యేందుకు మిక్సీ వాడొచ్చు. అదే తక్కువగా చేస్తే వాటిని చిన్న జార్‌లో వేసే బదులు చిన్న రోలులో వేయాలి. ఎందుకంటే, తక్కువగా వేస్తే అది ఆ బ్లేడ్స్‌లోనే చాలా వరకూ ఇరుక్కుంటుంది. త్వరగా బయటికి రాదు వాసన కూడా వస్తుంది. కాబట్టి, అలాంటి మసాలాలని చేత్తో నూరుకుంటేనే మంచిది. ఫ్రోజెన్.. చాలా మంది ఫ్రోజెన్ ఫుడ్స్ వాడుతుంటారరు. వీటిని అప్పుడే ఫ్రిజ్ నుంచి తీసి మిక్సీలో వేస్తే అది మెత్తగా అవ్వడానికి చాలా టైమ్ తీసుకుంటుంది. దీని వల్ల బ్లేడ్స్ త్వరగా అరిగిపోతాయి. అందుకే అలా చేయొద్దు కూరగాయలు... చాలా మంది కూరగాయల్ని కూడా చాపర్‌లో వేస్తుంటారు. కానీ, అలా వేయకపోవడమే మంచిది. ఇవన్నీ ఒకే పరిమాణంలో ఉండాలని అనుకుంటారు కానీ, అందులో ఏమైనా చిన్న చిన్న బ్యాక్టీరియా, పురుగులు వంటివాటిని గమనించలేం. అదే విధంగా, అన్నింటిని చాపర్‌లోనే వేయకూడదని గుర్తుపెట్టుకోండి.



## ఎకరాల కొద్ది భూమి ఉన్నా అమ్మలేరు.. పంచలేరు

పశ్చిమ గోదావరి: జిల్లాలోని చాలా మంది రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. వారి పేరు మీద ఎకరాల కొద్దీ భూములున్నా.. ఇటు ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక.. అటు వారసులకు పంచలేని దుస్థితిలో ఉన్నారు. కారణం వారి భూములు 22ఎ జాబితాలో ఉండటం. అదేలా జరిగింది అంటే.. ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్స్ ఈ జాబితాలోకి వస్తాయి. ఈ భూములను అమ్ముకోలేరు.. వారసులకు పంచలేరు.

పెద్దవేగి మండలంలో అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. గతంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులకు కేటాయించిన భూములను కొందరు అమ్ముకున్నారు. ఈ భూములు పలుమార్లు చేతులు మారాయి. అయితే గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ భూములను ఫ్రీహోల్డ్‌లో పెట్టింది. వాటి అమ్మకాలు, కొనుగోళ్లను నిలిపివేసింది. ఈ భూములకు సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, అడంగల్ పత్రాలు, పాస్‌పుస్తకాలు వంటివి ఉన్నా సరే.. పాలకుల నిర్ణయాల వల్ల సంవత్సరాల తరబడి ఇబ్బంది పడుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యను పరిష్కరిస్తుందని వారు ఆశించారు. కానీ రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఈక్రమంలో తాజాగా పెదవేగి మండలానికి చెందిన కొందరు.. కోర్టు అనుమతితో భూములను రిజిస్టర్ చేయించుకున్నారు. అయితే ఈ సమస్య ఎదుర్కొంటున్న అందరూ ఇలా కోర్టుకు వెళ్లడం సాధ్యం కాదు. కనుక ప్రభుత్వమే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. పెదవేగి మండలంలోనే అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటుంది. ఈ భూముల సమస్యలను పరిష్కరించాలని బాధితులు పీజీఆర్ఎస్‌లోనూ విన్నవించుకున్నారు. అయినా ప్రయోజనం లేదని తెలుస్తోంది. ఈ భూములపై ప్రతి వారం కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. సరైన పత్రాలు ఉన్న భూములను ఈ జాబితా నుంచి తొలగిస్తామని వెల్లడించారు. వాటి క్రయ, విక్రయాలకు అవకాశం కల్పిస్తున్నామని.. ఈ మేరకు తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చామని వారు పేర్కొన్నారు.

## వచ్చే రెండు నెలల్లో.. టీటీడీలో కీలక సంస్కరణలు!



తిరుమల: తిరుపతి దేవస్థానంలో వచ్చే రెండు నెలల్లో కీలక సంస్కరణలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయాన్ని టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. టీటీడీలో బదిలీలను అమలు చేయడంలో జాప్యం కొంత అసంతృప్తికి కారణమైందన్న ఆయన.. ఆలయ పరిపాలనా వ్యవహారాలపై కూడా ప్రభావం చూపిందని అభిప్రాయపడ్డారు. గత వైసీపీ హయాంలో కొంతమంది అధికారులను తిరుమల ఆలయంలో కీలక పదవులకు నియమించారన్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు.. ఇటీవలి వరకు వారు పదవుల్లో కొనసాగారని అన్నారు. పరిపాలన పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొంతమంది అధికారులను బదిలీ చేశామన్న టీటీడీ ఛైర్మన్.. వీరిలో కొంతమంది సున్నిత సమాచారాన్ని లీక్ చేసేవారని ఆరోపించారు.

దార్శనికత, లక్షలాది మంది భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా టీటీడీ పరిపాలనను క్రమబద్ధీకరించే దిశగా ఇది తొలి అడుగుగా టీటీడీ ఛైర్మన్ అభివర్ణించారు. తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులకు మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు, మెరుగైన దర్శన అనుభవం అందించే ఉద్దేశంతోటీటీడీ బోర్డు వచ్చే రెండు నెలల్లో కీలక సంస్కరణలను తీసుకువచ్చే పనిలో ఉందని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. మరోవైపు చంద్రగిరిలోని కోదండరామస్వామి ఆలయంలో అక్టోబరు 12 నుంచి మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు జరుగుతున్నాయి. ఈ పవిత్రోత్సవాలకు శనివారం అంకురార్పణ జరగ్గా.. నేటి నుంచి ప్రారంభమయ్యాయి. కోదండరామస్వామి ఆలయంలో ఏడాది పొడవునా అర్చనలు, ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. అయితే ఇలాంటి సమయాల్లో తెలియక దోషాలు జరుగుతుంటాయి. ఈ దోషాల వలన ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాల్లో భాగంగా అక్టోబరు 12వ తేదీ ఉదయం ఏడు నుంచి చతుష్టానార్చన, పవిత్రప్రతిష్ఠ నిర్వహించారు. సాయంత్రం పవిత్ర హోమాలు జరుగుతాయి. రేపు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అక్టోబరు 14వ తేదీ ఉదయం మహా పూర్ణాహూతి, కుంభప్రోక్షణ, స్నపన తిరుమంజనం, చక్రస్నానం, వీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఈ విషయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఓ ప్రకటనలో వెల్లడించింది.

# మృతుల కుటుంబాలకు రూ.1.40 కోట్లు

తురకపాలెం: గత నెల అనగా సెప్టెంబర్ వరకు కూడా ఏపీలోని గుంటూరు జిల్లా, తురకపాలెం గ్రామంలో వరుస మరణాలు.. సంచలనం సృష్టించాయి. నాలుగు నెలల వ్యవధిలో పదుల సంఖ్యలో జనాలు ప్రాణాలు విడిచారు. ఈ మిస్టరీ మరణాల వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గ్రామ ప్రజల మరణాలకు అత్యంత అరుదైన మెలియోడోసిస్ వ్యాధి కారణమని గుర్తించారు. మెలిన్ అనే బ్యాక్టీరియా వల్ల.. తురకపాలెం ప్రజలు జ్వరాల బారిన పడి మరణించినట్లు నిపుణులు గుర్తించారు.

గ్రామంలో వరుస మరణాలు చోటు చేసుకోవడంతో.. గుంటూరు జీజీహెచ్, గుంటూరు మెడికల్ కాలేజీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యు□లు, ఇతర నిపుణులు గ్రామానికి వచ్చి పదుల సంఖ్యలో పరీక్షలు నిర్వహించిన తర్వత మరణాల మిస్టరీ వీడింది. ఈక్రమంలో తురకపాలెం మృతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున సాయం చేసేందుకు ముందుకు వచ్చింది.



గుంటూరు జిల్లా, తురకపాలెంలో.. మెలియాయిడోసిస్ వ్యాధి లక్షణాలతో చనిపోయిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. వారికి ఆర్థిక సాయం ప్రకటించింది. చనిపోయిన వారిలో చాలా మంది పేదవారే ఉండటంతో.. బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సిందిగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటిం చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కోరారు. పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన అభ్యర్థనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. దీంతో తురకపాలెంమృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేయడానికి ఆమోదం తెలిపారు. దీంతో గ్రామంలో చనిపోయిన మొత్తం 28 మంది కుటుంబాలన్నింటికి కలిపి.. రూ. కోటి 40 లక్షలను మంజూరు చేసింది ప్రభుత్వం. నేడు అనగా ఆదివారం కేంద్ర మంత్రి పెమ్మసానితో పాటు ఎమ్మెల్యే రామాంజనేయులు తురకపాలెం గ్రామానికి వచ్చి చనిపోయిన వారి కుటుంబాలకు ఈ ఆర్థికసాయం అందజేయనున్నారు.

దాదాపు 3 వేల జనాభా ఉన్న పల్నాడు జిల్లా, తురకపాలెం గ్రామంలో గత నాలుగు నెలల వ్యవధిలోనే.. 28 మంది చనిపోయారని.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రకటించారు. జులై, ఆగస్టు రెండు నెలల్లోనే 20 మంది వరకు చనిపోయారు. వరుస మరణాలు గ్రామస్థులను భయపెట్టాయి. ఈక్రమంలో గ్రామంలో నిర్వహించిన పలు పరీక్షలు, పరిశోధనల అనంతరం.. మరణించిన వారంతా అతి ప్రమాదకరమైన 'మెలియాయిడోసిస్' అనే ఇన్‌ఫెక్షన్‌తో బాధపడి చనిపోయినట్లు తెలిపారు. మెలిన్ అనే బ్యాక్టీరియా వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడమే కాక.. స్వయంగా ప్రభుత్వమే గ్రామస్థులకు స్వయంగా ప్రభుత్వమే ఆహారం, తాగునీరు అందజేసింది.

## పాలిథిన్ వాడకంపై జరిమానా.. అమ్మితే రూ.1000..

ఆంధ్రప్రదేశ్: పర్యావరణానికే కాక మనుషలకు కూడా తీవ్ర స్థాయిలో నష్టం కలిగించేది ఏదైనా ఉందా అంటే.. అదే ప్లాస్టిక్. మనిషి జీవితంలో ఇది భాగమయిపోయింది. నేడు గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి చోటా పాలిథిన్ సంచులు దర్శనం ఇస్తున్నాయి. ఇది భూమిలో కరగదు.. అలానే మిగిలిపోతుంది. ఇక పట్టణాల్లో అయితే పశువులు.. ప్లాస్టిక్ తిని తీవ్ర అనారోగ్యం పాలై.. నరకయాతన అనుభవిస్తాయి. ప్లాస్టిక్ వినియోగం మీద ప్రభుత్వాలు నిషేధం విధించినా సరే.. వినియోగం మాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉప సభాపతి రఘురామ కృష్ణ రాజు పాలిథిన్ వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. రఘురామకృష్ణరాజు .. ఆకివీడులో స్థానిక వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో



మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. పాలిథిన్ సంచులు పర్యావరణానికి నష్టం కలిగించడమే కాక ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నా యని తెలిపారు. అలాంటి పాలిథిన్ సంచుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. అలా కాకుండా ఎవరైనా పాలిథిన్ సంచులు అమ్మినా.. వాడినా.. అలాంటి వారి మీద కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారు లకు ఆదేశాలు జారీ చేశారు. పాలిథిన్ వినియోగాన్ని అరికట్టడం కోసం భారీ ఎత్తున జరిమానాలు విధించాలని సూచించారు. ఆదివారం నుంచి ఆకివీడులో కఠిన నియమాలు అమలు చేయాలని తెలిపారు. దీనిలో భాగంగా ఎవరైనా దుకాణం నిర్వహకుడి వద్ద ప్లాస్టిక్ సంచులు నిల్వ ఉన్నా.. అమ్మినా సదరు షాపు యజమానికి వెయ్యి రూపాయలు జరిమానా విధించాలని సూచించారు. ఎవరైనా పండ్లు, కూరగాయలు, మాంసం, సరుకులు, ఆహార పదార్థాలు, తదితర వస్తువులను పాలిథిన్ సంచుల్లో తీసుకెళ్తే.. వారికి రూ.100 జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం మళ్లింపు రహదారిని.. పూర్తిస్థాయిలో వినియోగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆక్రమణల తొలగింపు అంశంలో ఎలాంటి రాజీపడొద్దని సూచించారు. ప్రజలు, షాపుల నిర్వాహకులు.. తమ దుకాణాలు, నివాసాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి.. వాటిని పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ప్రజలు, ప్రభుత్వం సమిష్టి కృషితో ఆదర్శవంతమైన ఆకివీడుగా తీర్చిదిద్దవచ్చని సూచించారు. ఉండి నియోజకవర్గంలో ఉన్న పంట కాల్వల్లో ఎవరైనా ప్లాస్టిక్ వ్యర్థాలు వేసినా.. ఇతర చెత్త వేసినా.. వారికి రూ.1000 జరిమానా విధిస్తామని తెలిపారు. ఇలా వచ్చిన మొత్తాన్ని కాలువ అభివృద్ధి నిధికి జమ చేస్తామని.. ఆమొత్తాన్ని పంట కాలువలను శుభ్రం చేసేందుకు వినియోగిస్తామని తెలిపారు.

## రుషికొండను ఎలా ఉపయోగించాలనుకుంటున్నారు..



రుషికొండ: భవనాలు.. ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి.. దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో రుషికొండ భవనాలను నిర్మించారు. అయితే పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి.. పర్యావరణాన్ని దెబ్బతీసేలా ఈ భవనాలను నిర్మించారని అప్పట్లో విపక్షంగా ఉన్న టీడీపీ ఆరోపణలు చేస్తూ వచ్చింది. దీంతో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రుషికొండ భవనాలను ఏం చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. సుమారుగా రూ.452 కోట్లు ఖర్చు చేసి అత్యంత విలాసవంతంగా ఈ భవనాలు నిర్మించారు. అయితే టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి16 నెలలవుతు న్నా ఈ రుషికొండ ప్యాలెస్ మీద నిర్ణయం తీసుకోలేకపోయింది. ఈ క్రమంలోనే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది ఏపీ ప్రభుత్వం. రుషికొండ ప్యాలెస్‌ను ఎలా ఉపయోగించుకోవాలి.. ఆ భవనాలను ఎలా వినియోగంలోకి తేవాలనే దానిపై ఆగస్టు 28న మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. మంత్రులు పయ్యా వుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయస్వామి సభ్యులుగా కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇటీవల సమావేశమై రుషికొండ ప్యాలెస్ గురించి చర్చించింది. రుషికొండ మీద గతంలో పర్యాటకాభివృద్ధి సంస్థ నిర్వహణలో ఓ రిసార్టు ఉండేది. దీని ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి రూ.7 కోట్ల ఆదాయం వచ్చేది. అయితే వీటిని కూల్చేసి.. రుషికొండ ప్యాలెస్ కట్టారని మంత్రులు అభిప్రాయపడ్డారు. అలాగే రుషికొండ ప్యాలెస్ కరెంటు ఛార్జీలు ఇతరత్రా నిర్వహణ ఖర్చుల కోసం ఏపీ ప్రభుత్వానికి ప్రతి నెలా రూ.25 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో రుషికొండ భవనాల్ని ఎలా వినియోగించుకోవాలనే దానిపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని ఏపీ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయానికి వచ్చింది. ఈ సలహాలు, సూచనలు పరిశీలించాక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఈ అంశం గురించి నివేదిక ఇద్దామని నిర్ణయించింది. ఈ క్రమంలోనే రుషికొండ ప్యాలెస్‌ను ఎలా వినియోగిస్తే బాగుంటుందో చెప్పాలంటూ ప్రజల నుంచి ఏపీ పర్యాటక శాఖ సలహాలు, సూచనలను ఆహ్వానిస్తోంది. ఈ విషయాన్ని ఏపీ టూరిజం అథారిటీ సీఈవో ఆమ్రపాలి వెల్లడించారు. ప్రజలు తమ సలహాలు, సూచనలను rushikonda@aptdc.inకు మెయిల్ చేయాలని సూచించారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సమావేశం కానున్నామన్న ఆమ్రపాలి.. వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటామన్నారు. ఈ సలహాలు, అభిప్రాయాలను కేబినెట్ సబ్ కమిటీ సమీక్షించి. తుది నిర్ణయం తీసుకుంటుందని ఆమ్రపాలి వెల్లడించారు.

## మహిళా ప్రయాణికులు బ్యాడ్‌న్యూస్.. ఫ్రీ బస్ వర్తించదు

ఆంధ్రప్రదేశ్: ప్రభుత్వం అమలు చేస్తోన్న స్త్రీ శక్తి పథకానికి మంచి ఆదరణ లభిస్తోంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన నాటి నుంచి బస్సుల్లో రద్దీ పెరుగుతోంది. అయితే కొన్ని రూట్లలో మహిళా ప్రయాణికుల వద్ద నుంచి కూడా ఛార్జీ వసూలు చేస్తున్నారు. బస్ స్టాప్ ఉన్నా బస్సులు ఆగడం లేదు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ డయల్ యువర్ డీఎం కార్యక్రమం ప్రారంభిం చింది. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ ప్రయాణికులు సమస్యలు తెలుసుకుని.. పరిష్కరించారు. ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ.. డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో కుక్కునూరు రూట్‌లో స్త్రీ శక్తి పథకం అమలు కావడం లేదని, ఛార్జీల విషయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని.. పైగా పురుషులు కూడా ఎక్స్‌ప్రెస్ బస్సు ఛార్జీల కంటే కూడా ఎక్కువే చెల్లించాల్సి వస్తుందని డిపో మేనేజర్‌కి తెలిపారు. ఈ ఫిర్యాదులపై ఆయన స్పందించారు.

రాజమహేంద్రవరం-భద్రాచలం వయా కుక్కునూరు రూట్‌లోని అల్ట్రా డీలక్స్ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే స్త్రీశక్తి పథకం వర్తించదని తెలిపారు. అంతర్రాష్ట్ర సర్వీసుల్లో అలానే ఇతర రాష్ట్రాల్లో 16 కిలోమీటర్ల లోపు ప్రయాణ పరిధి ఉంటేనే స్త్రీ శక్తి పథకం వర్తిస్తుందని ఆయన ప్రయాణికులకు తెలిపారు.

మరి కొందరు ప్రయాణికులు మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రస్తుతం రద్దు చేసిన రాజమహేంద్రవరం-పేకేరు నైట్‌హాల్టు బస్సును తిరిగి నడపాల్సిందిగా కోరారు. దీనిపై మాధవ స్పందిస్తూ.. ఈ బస్సుకు సరైన ఆదాయం లేకపోవడం వల్లే ఆ సర్వీసును రద్దు చేశామని తెలిపారు. అయితే, కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చాక ఆ సర్వీసును పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అలానే వేమగిరి గట్టు వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఉన్నప్పటికీ కొన్ని బస్సులు ఆగడం లేదని.. అలానే బొబ్బిల్లంక స్టేజీ వద్ద కూడా ఇదే సమస్య ఉందని ఫిర్యాదు వచ్చింది. దీనిపై స్పందించిన మాధవ.. ప్రయాణికులు చేయి ఎత్తిన చోట ఎక్కించుకుని, వారు కోరిన చోట దించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

రాజమహేంద్రవరం నుంచి వయా చక్రద్వారబంధం మీదుగా రామచంద్రాపురం వెళ్లే బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని కొందరు కోరారు. దీనిపై డీఎం స్పందిస్తూ.. కొత్త బస్సులు వచ్చాక తుంగపాడు మీదుగా ఆ బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇవే కాక.. ద్వారపూడి గ్రామంలోకి అద్దె బస్సులు తిప్పేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బస్టాండులో బస్సుల టైమింగ్స్ డిస్‌ప్లే ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీటితో పాటుగా పండుగల సమయంలో ద్వారపూడి నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేకంగా బస్సులు నడపాలని వచ్చిన విన్నపంపై కూడా ఆయన సానుకూలంగా స్పందించారు.

## రూ.1500 కోట్లతో డేటా సెంటర్..

ఆంధ్రప్రదేశ్: ఆర్థిక రాజధానిగా విశాఖపట్నాన్ని అభివృద్ధి చేస్తామని చెప్తున్న ఏపీ ప్రభుత్వం.. ఆ దిశగా కసరత్తు మొదలుపెట్టింది. ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు, ప్రోత్సాహకాలతో విశాఖ కేంద్రంగా పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ముందుకు వస్తున్నాయి. ముఖ్యంగా విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి పరిశ్రమలు విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. మొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌కు ఆదివారం శంకుస్థాపన జరిగింది. ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ఐటీ పార్క్‌లోని హిల్ నెంబర్-3లో సిఫీ డేటా సెంటర్‌కు నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ డేటా సెంటర్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 3.6 ఎకరాల భూమి కేటాయి ంచింది. డిజిటల్ ఐటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన సిఫీ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ ఈ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. 50 మెగావాట్ల సామర్థ్యంతో ఈ ఏఐ ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్ ను అలాగే.. ఓపెన్ కేబుల్ ల్యాండిం గ్ స్టేషన్ ఏర్పాటు చేస్తోంది. రెండు దశలలో 1500 కోట్ల రూపాయల పెట్టుబడితో ఈ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. ఎడ్జ్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా సుమారుగా వేయి మందికి ఉపాధి దొరుకుతుందని అధికారులు చెప్తున్నారు. విశాఖపట్నం గ్లోబల్ డిజిటల్ గేట్ వేగా మారేందు కు ఈ డేటా సెంటర్ ఉపయోగపడుతుందంటున్నారు. యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామ ని ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడుల ఆకర్షణ కోసం నూతన పారిశ్రామిక విధానాలను అనుసరిస్తోంది.

## విశాఖవాసులకు భారీ శుభవార్త.. త్వరలో ఢిల్లీలో ప్రకటన..



విశాఖ: దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ విశాఖపట్నానికి రాబోతోందని నారా లోకేష్ వెల్లడించారు. దీనికి సంబంధించి త్వరలోనే ఢిల్లీలో ముఖ్యమైన ప్రకటన చేస్తామన్నారు. అలాగే నాలుగు జిల్లాలతో గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్‌లో శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకూ ఉంటాయ న్నారు. రాష్ట్రానికి వచ్చే వంద బిలియన్ డాలర్ల పెట్టుబడులలో.. విశాఖపట్నానికే సగం పెట్టుబడులు వస్తున్నాయని నారా లోకేష్ వెల్లడించారు. 2047 నాటికి విశాఖ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుందని నారా లోకేష్ అంచనా వేశారు. విశాఖకు గూగుల్ , టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు వస్తున్నాయన్న లోకేష్.. వచ్చే మూడు నెలల్లో విశాఖకు మరిన్ని కంపెనీలు వస్తాయన్నారు. వైజాగ్‌లోనే ఐదు లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పిస్తామని నారా లోకేష్ స్పష్టం చేశారు. మరోవైపు హైదరాబాద్ అభివృద్ధి చెందడానికి 30 ఏళ్లు పడితే.. విశాఖకు పదేళ్లు చాలని నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు విశాఖ గమ్యస్థానంగా మారిందని.. విశాఖలో పెట్టుబడులపై మూడు నెలల్లో మరిన్ని ప్రకటనలు వస్తాయని అన్నారు. విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. రాష్ట్రానికి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయన్న నారా లోకేష్.. ఇందులో 50 శాతం విశాఖకే వస్తున్నాయని వెల్లడించారు. పెట్టుబడులు వస్తుంటే కొంతమందికి గిట్టడం లేదని నారా లోకేష్ విమర్శించారు. టీసీఎస్ సంస్థకు తక్కువ ధరకు ప్రభుత్వం భూములు కేటాయించిందని కొంతమంది కోర్టుకు వెళ్లారన్న నారా లోకేష్.. టీసీఎస్ వచ్చిన తర్వాతనే ఏపీకి కంపెనీలు క్యూ కడుతున్నాయన్నారు. ఏపీ ప్రభుత్వం పరిశ్రమలకు ఉత్తమ విధానాలు కల్పిస్తోందని.. ఈ పెట్టుబడుల ద్వారా పెద్ద మొత్తంలో ఉద్యోగాలు వస్తాయన్నారు. సూపర్ సిక్స్ హామీలలో ఇచ్చిన విధంగా రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉపాధి కల్పించడమే తమ ప్రభుత్వం లక్ష్యమన్నారు నారా లోకేష్.. మరోవైపు సిఫీ టెక్నాలజీస్ డేటా సెంటర్‌కు నారా లోకేష్ ఆదివారం శంకుస్థాపన చేశారు. రుషికొండ ఐటీ పార్క్, హిల్ నెంబర్-3లో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం 3.6 ఎకరాల భూమి కేటాయించింది. రూ.1500 కోట్లతో రెండు దశలలో 50 మెగావాట్ల ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండింటికీ ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నారా లోకేష్.. విశాఖకు వచ్చే పెట్టుడులు. గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్ వంటి అంశాలపై మాట్లాడారు.

# సాయి పల్లవి, అనిరుధ్‌కు కలైమామణి పురస్కారం





దక్షిణాది అగ్ర కథానాయిక సాయి పల్లవికి అరుదైన గౌరవం దక్కింది. తమిళనాడు ప్రభుత్వం నుంచి 'కలైమామణి' పురస్కారాన్ని అందుకున్నారు. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించిన సాయి పల్లవి, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ తో పాటు పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కళారంగంలో విశేష కృషి చేసిన వారికి ఈ అత్యున్నత పురస్కారాన్ని అందజేస్తారు. దక్షిణాది అగ్ర కథానాయిక సాయి పల్లవి మరో అరుదైన గౌరవం అందుకున్నారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి 'కలైమామణి' పురష్కారానికి ఎంపికయ్యారు. సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ కి కూడా ఈ గౌరవం దక్కింది. శనివారం సాయంత్రం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చేతుల మీదుగా ఈ అవార్డులను సాయి పల్లవి, అనిరుధ్ స్వీకరించారు. కళారంగంలో విశేష కృషి చేసిన వారికి తమిళనాడు ప్రభుత్వం ప్రతీ ఏడాది 'కలైమామణి' అవార్డును ప్రకటిస్తుంటారు. రాష్ట్ర అత్యున్నత పురష్కారాలలో దీన్ని ఒకటిగా భావిస్తారు. 2021, 2022, 2023 సంవత్సరాలకుగాను మొత్తం 90 మందికి పురస్కారాలు అందజేశారు. 2021 ఏడాదికి గాను నటనా విభాగంలో సాయిపల్లవికి అవార్డు వరించింది. 2023 సంవత్సరానికిగాను అనిరుద్ కి ఈ పురస్కారం లభించింది. దర్శక నటుడు ఎస్.జె. సూర్య, డైరెక్టర్ లింగుసామి, ప్రముఖ నటులు విక్రమ్ ప్రభు, మణికందన్ వంటి పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

# పాన్ ఇండియా స్టార్



తాజాగా హైదరాబాద్‌లో జరిగిన ది ఫాస్ట్ క్యూరియస్ ఆటో ఎక్స్పో 2025 ఈవెంట్‌లో పాల్గొన్న తేజ్ అభిమానులతో ముచ్చటించే సమయంలో అల్లు అర్జున్ గురించి చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. తేజ్‌ను ఒక అభిమాని "అల్లు అర్జున్ గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అని అడగ్గా.. ఆయన కాస్త ఇబ్బంది పడుతూనే ఆన్సర్ ఇచ్చాడు. 'అల్లు అర్జున్ ఇప్పుడు ఇండియాలోని బిగ్గెస్ట్ హీరోల్లో ఒకరు. చాలా గొప్పోడు అయిపోయాడు" అని అన్నారు. తేజ్ కామెంట్స్‌పై సోషల్‌మీడియాలో బన్నీ అభిమానులు విరుచుకుపడుతున్నారు. కొందరు "తేజ్‌కి బన్నీంటే ఇష్టం లేదు", " ఎప్పుడూ మెగా హీరోల వెంటే ఉంటాడు", 'ఆయన మాటల్లో అల్లు అర్జున్‌పై ఈర్ష్య కనిపిస్తోంది' అంటూ కామెంట్లు చేస్తున్నారు. గతంలో జనసేన ఎన్నికల సమయంలో అల్లు అర్జున్ తన స్నేహితుడైన వైసీపీ అభ్యర్థి శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డికి సపోర్ట్ చేయడం పెద్ద వివాదానికి దారితీసింది. ఆ ఘటనతో మెగా కుటుంబం, అల్లు కుటుంబం మధ్య విభేదాలు వచ్చినట్లు వార్తలొచ్చాయి. ఆ సమయంలో సాయి ధరమ్ తేజ్ కూడా సోషల్ మీడియాలో అల్లు అర్జున్‌ని అన్ ఫాలో చేసినట్లు వార్తలు వచ్చాయి. అప్పటి నుంచి ఈ ఇద్దరి మధ్య మాటలు లేవని చెప్పుకుంటారు. ఇప్పుడు తేజ్ మళ్లీ బన్నీ గురించి మాట్లాడడంతో ఆ చర్చ మళ్లీ చెలరేగింది. ఇటీవల అల్లు కనకరత్నమ్మ మరణించినప్పుడు అల్లు అర్జున్, పవన్ కళ్యాణ్ ఎంతో ఆప్యాయంగా పలకరించుకోవడం, ముచ్చట్లు చెప్పుకోవడంతో మెగా, అల్లు ఫ్యామిలీల మధ్య గొడవలన్నీ సమసిపోయినట్లేనని అందరూ అనుకుంటున్న సంగతి తెలిసిందే. అల్లు అర్జున్ గురించి సాయిదుర్గా తేజ్ పాజిటివ్‌గా మాట్లాడటాన్ని మెగా ఫ్యాన్స్ ప్రశంసిస్తుంటే, బన్నీ ఫ్యాన్స్ మాత్రం విమర్శిస్తున్నారు. సాయిదుర్గా తేజ్ అయితే అనవసర వివాదాలపై స్పందించకుండా తన సినిమాలపై దృష్టి పెట్టాడు. ప్రస్తుతం ఆయన ' సంబరాల ఏటిగట్టు ' అనే పీరియాడికల్ యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లో నటిస్తున్నారు. రోహిత్ కె.పి. ఈ సినిమాతో అతను దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇందులో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్. ఇటీవల రిలీజ్ చేసిన పోస్టర్‌లో సాయిధరమ్ తేజ్ 8 ప్యాక్ బాడీతో అదిరిపోయే లుక్‌లో సర్‌ప్రైజ్ చేశాడు. అన్నీ సక్రమంగా జరిగితే ఈ చిత్రం మొన్న దసరాకే రిలీజ్ కావాల్సి ఉంది. అయితే బడ్జెట్ సమస్యలో షూటింగ్ ఆగిపోవడం వల్ల ఆలస్యమైంది. ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# టిల్లు గాడి లవ్ స్టోరీ..



సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్లు చేస్తూ హీరోగా మారాడు సిద్ధు జొన్నలగడ్డ. 'డీజే టిల్లు'తో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ తెచ్చుకున్న ఆయన అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. డిఫరెంట్ రోల్స్, స్లాంగ్‌తో ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేకమైన ఫ్యాన్‌బేస్ ఏర్పరచుకున్నాడు. టీజీ టిల్లు, టిల్లు స్క్వేర్ చిత్రాలతో భారీ విజయాలు అందుకున్న సిద్ధు అదే ఉత్సాహంతో వరుసగా కొత్త ప్రాజెక్టులలో నటిస్తూ బిజీగా ఉన్నాడు. ఇటీవల ఆయన నటించిన 'జాక్' సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా సిద్ధు మనోధైర్యం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. తాజాగా ' తెలుసు కదా ' అనే ప్రేమకథా చిత్రంతో మళ్లీ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతున్నాడు. దీపావళి సందర్భంగా అంటే అక్టోబర్ 17న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సిద్ధు ప్రస్తుతం మీడియా ఇంటర్వ్యూలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. ఈ క్రమంలో ఒక ఇంటర్వ్యూలో తన లవ్ స్టోరీని షేర్ చేయడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

"నేను ఏడో తరగతిలో ఉన్నప్పుడు ఒక అమ్మాయిని ఇష్టపడ్డాను. పదో తరగతి వరకు ఆమెతో కలిసి చదివాను. కానీ నా మనసులో ఉన్న ప్రేమను ఎప్పుడూ చెప్పలేకపోయాను. చివరి రోజు ఆమె నా స్లామ్ బుక్‌లో ఒక కోట్‌తో పాటు తన ల్యాండ్‌లైన్ నంబర్ రాసింది. ఆ తర్వాత ఒకసారి వెనక్కి తిరిగి చూసి సైకిల్‌పై వెళ్ళిపోయింది. ఆ క్షణం నేటికీ మర్చిపోలేకపోతున్నాను," అని గుర్తుచేసుకున్నాడు. "నేను ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఫాలో అవుతుంటాను. ఆమెకు పెళ్లయి పిల్లలు కూడా పుట్టేశారు. ఆమె నా జీవితంలో భాగం కాలేకపోవడం బాధగా ఉంటుంది" అంటూ కొంచెం భావోద్వేగంతో మాట్లాడాడు. ఈ వ్యాఖ్యలు బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. అభిమానులు 'సిద్ధు లవ్ ఫెయిల్యూర్' అంటూ కామెంట్లు చేస్తున్నారు. 'తెలుసు కదా' సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో రాశీ ఖన్నా , శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్ మరియు టి.జి. కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం బాధ్యతలు నీరజ్ కోన వహించారు. ఈ సినిమా కథలో ఇద్దరు అమ్మాయిలను ప్రేమించే యువకుడి జీవితంలో జరిగే సంఘటనలను వినూత్నంగా చూపించామని మేకర్స్ చెబుతున్నారు. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్స్, సాంగ్స్ యూత్‌లో మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఇక ఈ మూవీ విజయంపై సిద్ధు పెద్ద ఆశలు పెట్టుకున్నాడు. టిల్లు' తర్వాత మళ్లీ తన స్థాయిలో మాస్ మరియు యూత్ కనెక్ట్ అందుకునేందుకు ఇదే సరైన ప్రాజెక్ట్‌గా భావిస్తున్నాడు.

# దయచేసి అలాంటి ప్రశ్నలు అడగకండి..



ఇటీవల తెలుగు సినీ జర్నలిస్టులు అడుగుతున్న ప్రశ్నలు వివాదాస్పదంగా మారుతున్నాయి. కొందరు సెలబ్రెటీలు మనకెందుకులే అని వాళ్లని వదిలేస్తుంటే మరికొందరు ధైర్యం చేసి తప్పుని తప్పు అని చెబుతున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మంచు లక్ష్మి డ్రెస్సింగ్ గురించి ఓ సీనియర్ జర్నలిస్టు ప్రశ్నించగా.. నీకెంత ధైర్యం అంటూ ఆమె అక్కడికక్కడే కడిగి పారేసింది. అంతటితో ఆగకుండా తనను అవమానించేలా ప్రశ్నించారంటూ మా అసోసియేషన్‌కి, ఫిల్మ్ ఛాంబర్‌కి ఫిర్యాదు చేసింది. దీంతో దిగొచ్చిన ఆ సీనియర్ జర్నలిస్టు బేషరతుగా ఆమెకు క్షమాపణ చెబుతూ వీడియో రిలీజ్ చేశారు. ఆ వివాదం సద్దుమణిగి ఒక్కరోజు కూడా కాలేదు ఓ లేడీ జర్నలిస్టు తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్‌ని అడగకూడని ప్రశ్న అడిగి వివాదంలో చిక్కుకున్నారు. 'డ్యూడ్ ' సినిమా ప్రమోషన్లలో భాగంగా హైదరాబాద్ లో ప్రెస్‌మీట్ నిర్వహించిన సమయంలో ఓ లేడీ జర్నలిస్టు మాట్లాడుతూ.. 'మీరు లుక్ పరంగా హీరో మెటీరియల్ కాదు. కానీ రెండు సినిమాలకే ఇంత సక్సెస్ వచ్చిందంటే అది మీ హార్డ్ వర్కా.. లేక అదృష్టమా? అని ఆమె ప్రశ్నించారు. దానికి ఏం సమాధానం చెప్పాలా ప్రదీప్ రంగనాథన్ ఆలోచిస్తుండగా పక్కనే ఉన్న శరత్‌కుమార్ మైక్ అందుకున్నారు. నేను 170 సినిమాల్లో నటించాను. ప్రదీప్ హీరో మెటీరియల్ కాదని మీరెలా చెప్పగలరు. ఇక్కడున్న ప్రతి ఒక్కరూ హీరో మెటీరియలే. హీరో అంటే ఫలానా లక్షణాలు ఉండాలని ఏమీ లేదు. ఈ సమాజానికి మేలు చేసే ప్రతి వ్యక్తి హీరోనే' అని సమాధానం ఇచ్చారు. తాజాగా కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన ' కె ర్యాంప్ ' చిత్ర ట్రైలర్‌ని శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అదే జర్నలిస్టు ప్రదీప్ ఇష్యూ గురించి స్పందించాలని కిరణ్‌ని అడిగారు. దీంతో ఆయన మాట్లాడుతూ.. . 'మీరు పక్క రాష్ట్రం నుంచి వచ్చిన హీరోని కించపరుస్తూ అలాంటి ప్రశ్న వేయడం కరెక్ట్ కాదు. మనమంతా ఒక్కటే. ఏదున్నా మనం మనం చూసుకుంటాం. అంతేకానీ పక్క రాష్ట్రం నుంచి వచ్చిన వాళ్లని కించపరిచేలా అలాంటి ప్రశ్నలు దయచేసి అడగొద్దు. ప్రదీప్‌ని హీరో మెటీరియల్ కాదు అని మీరు అనడం చూస్తున్న నాకే బాధగా అనిపించింది. ఆయన ఇంకెంత బాధపడి ఉంటారు. ఇకపై అలాంటి ప్రశ్నలు అడగకండి' అని చెప్పారు.

# 'లాపతా లేడీస్'కి 13 అవార్డులు..



70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక అహ్మదాబాద్‌లో అట్టహాసంగా జరిగింది. 'లాపతా లేడీస్' చిత్రం 13 విభాగాల్లో సత్తా చాటింది. ఉత్తమ నటులుగా అభిషేక్ బచ్చన్, కార్తీక్ ఆర్యన్.. ఉత్తమ నటిగా అలియా భట్ అవార్డులు అందుకున్నారు. రవి కిషన్, ఛాయా కదమ్, నితాన్షీ గోయెల్, లక్ష్య, రాజ్‌కుమార్ రావ్, ప్రతిభ కూడా వివిధ విభాగాల్లో పురస్కారాలు గెలుచుకున్నారు. 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ వేడుక అహ్మదాబాద్‌లో శనివారం అట్టహాసంగా జరిగింది. దీనికి షారుక్ ఖాన్, కరణ్ జోహార్, మనీష్ పాల్ హోస్ట్‌లుగా వ్యహరించారు. 2024 సంవత్సరంలో విడుదలైన సినిమాలను ఎంపిక చేసి, వివిధ విభాగాలలో అవార్డులు అందజేశారు. ఇందులో 'లాపతా లేడీస్' సినిమా ఏకంగా 13 క్యాటగిరీలలో అవార్డులు సొంతం చేసుకుంది. ఉత్తమ నటుడి పురస్కారాన్ని అభిషేక్ బచ్చన్ (ఐ వాంట్ టు టాక్), కార్తీక్ ఆర్యన్ (చందు ఛాంపియన్) స్వీకరించారు. 'జిగ్రా' సినిమాకిగానూ ఉత్తమ నటి అవార్డును అలియా భట్ అందుకున్నారు.

# బిగుసుకుంటోన్న ఉచ్చు..



తెలుగు సినీ పరిశ్రమలో తనదైన నటనతో గుర్తింపు పొందిన టాలెంటెడ్ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ మహాత్మా గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. రామ్ గోపాల్ వర్మ, పూరి జగన్నాథ్ వంటి దర్శకుల సినిమాల్లో నటించి మంచి పేరు తెచ్చుకున్న ఆయన నోటికొచ్చినట్లు మాట్లాడుతూ తరచూ వివాదాలకు కేంద్ర బిందువు అవుతున్నారు. గతంలో కూడా "పొట్టేలు" సినిమాపై రివ్యూలు రాసే వారిని అవమానించే రీతిలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు గురయ్యాయి. ఇప్పుడు గాంధీ జయంతి సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు మరింత పెద్ద వివాదంగా మారాయి. దీనిపై ఇప్పటికే సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్లో పలు సంఘాలు ఆయనపై ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్వయంగా సైబర్ క్రైమ్ విభాగంలో శ్రీకాంత్ అయ్యంగార్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మీడియాతో మాట్లాడుతూ "శ్రీకాంత్ అయ్యంగార్ మా అసోసియేషన్ సభ్యుడిగా ఉన్నాడు. అయినప్పటికీ ఫాదర్ ఆఫ్ ది నేషన్ గురించి అవమానకరంగా మాట్లాడడం అంగీకారయోగ్యం కాదు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజల మధ్య విభేదాలను రేకెత్తిస్తాయి. అందుకే ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాం" అన్నారు. దీనిపై సినీ పరిశ్రమలోని పెద్దలు కూడా స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రముఖ హీరోలు, నిర్మాతలు, సినీ పెద్దలు ఈ వ్యవహారంపై మౌనం వహించకూడదు. శ్రీకాంత్ వ్యాఖ్యలపై కఠినంగా స్పందించాలి. లేని పక్షంలో మేము యాంటీ బయోటిక్‌గా మారాల్సి వస్తుంది" అని బల్మూరి వెంకట్ హెచ్చరించారు. శ్రీకాంత్ అయ్యంగార్‌పై మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కి కూడా ఫిర్యాదు చేశామని, విచారణ జరిపి కఠినచర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై 'మా' జనరల్ సెక్రటరీ శివబాలాజీ స్పందిస్తూ.. వాక్ స్వాతంత్ర్యం పేరుతో ఎవరికీ ఎదుటివారి మనోభావాలు దెబ్బతీసే హక్కు లేదన్నారు. 'మా' క్రమశిక్షణ కమిటీ ఈ అంశంపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తనపై వరుస ఫిర్యాదులు చేస్తున్నా శ్రీకాంత్ అయ్యంగార్ ఎక్కడా స్పందించిన దాఖలాలు కనిపించడం లేదు. ఈ వివాదంపై ఆయన స్పందిస్తా రా? లేక గతంలో లాగ ఎవరేం చేసుకుం టారో చేసుకోండని సవాల్ విసురుతారా? అన్నది చూడాలి. ఈ వివాదానికి ఆయన ఫుల్‌స్టాప్ పెట్టకపోతే కెరీర్‌పై కచ్చితంగా ప్రభావం చూపించే అవకాశాలు కనిపిస్తున్నా యని ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


# బొమ్మ బ్లాక్‌బస్టర్ అక్కడ..



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని , భాగ్యశ్రీ బోర్సే జంటగా తెరకెక్కిన మూవీ ' ఆంధ్రా కింగ్ తాలూకా '. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్ పి. మహేష్ బాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మాస్ ఎంటర్‌టైనర్‌ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. వివేక్-మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో మేకర్స్ అప్పుడే ప్రమోషన్లు మొదలుపెట్టేశారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం (అక్టోబర్ 12) నాడు టీజర్ వదిలారు. ఈ మూవీలో కన్నడ రియల్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించనుండగా, ఆయన్ని ఆరాధించే వీరాభిమానిగా రామ్ కనిపించనున్నాడు. తాజాగా విడుదల చేసిన టీజర్ రామ్ ఆయనకు డైహార్డ్ ఫ్యాన్ అనే అంశాన్ని హైలైట్ చేశారు. రామ్ ఎనర్జీ, మాస్ డైలాగ్స్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అలాగే గోదావరి అందాల నడుమ హీరో హీరోయిన్ల ప్రేమకథని మరింత అందంగా చూపించే ప్రయత్నం చేశారు. ఈ మూవీలో రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో కనిపిస్తున్నారు.

'సినిమాకి ఎందుకు తీసుకెళ్లావ్.. పిల్లాణ్ణి ఇలాగే పాడుచేసి పెట్టు' అని రామ్ తల్లి డైలాగ్‌తో టీజర్ మొదలుకాగా.. సినిమాలు చూసి ఎవరు చెడిపోతారే' అంటూ తండ్రి రావు రమేష్ సమాధానం ఇవ్వడం ఆసక్తి రేపుతోంది. వాళ్ల సమస్యని మన సమస్య అనుకోవడమేరా ప్రేమంటే, నీకు నైజాంలో కోసి, గుంటూరులో కారం పెట్టి సీడెడ్‌లో ఫ్రై చేసి, ఆంధ్రాలో పలావు వండేత్తే మొత్తం తెగిపోద్ది.. అంటూ గోదావరి యాసలో రామ్ చెప్పిన డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. కాలేజీ నేపథ్యంలో సాగే ఈ కథలో హీరోల ఫ్యాన్ మధ్య వార్ గురించి లోతుగా చూపించినట్లుగా టీజర్ ద్వారా తెలుస్తోంది. ఫ్యానూ ఫ్యానూ అని నువ్వు ఓ గుడ్డలు చింపేసుకోవడమే గానీ నువ్వొకడివి ఉన్నావని కూడా మీ హీరోకి తెలియదు. ఏం బతుకులురా మీవి' అంటూ లాస్ట్‌లో మురళీశర్మ చెప్పే డైలాగ్ యూత్‌కి గట్టిగా తగిలేలా ఉంది. మొత్తమ్మీద 'ఆంధ్రా కింగ్ తాలూకా' టీజర్ చూశాక పాజిటివ్ వైబ్స్ పెరిగాయి. ఇటీవల కాలంలో సరైన హిట్ లేని రామ్ పోతినేని ఈ మూవీతో బ్లాక్‌బస్టర్ కొట్టడం ఖాయమని ఆయన ఫ్యాన్స్ కాలర్ ఎగరేస్తున్నారు.

# మోగ్లీ రిలీజ్ డేట్‌ఫిక్స్..



ఫారెస్ట్ నేపథ్యంలో సాగే యూనిక్ రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా 'మోగ్లీ 2025' రెడీ అవుతోంది. ఇందులో రోషన్ కనకాల సరసన సాక్షి మడోల్కర్ హీరోయిన్ గా నటిస్తుండగా.. బండి సరోజ్ కుమార్ విలన్ గా కనిపించనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ చివరి దశకు చేరుకోవడంతో విడుదల తేదీని ఖరారు చేశారు. దీపావళి నుంచి సంక్రాంతి వరకూ ఆల్రెడీ చాలా సినిమాలు రిలీజ్ డేట్స్ బ్లాక్ చేయడంతో, వాటి మధ్యలో గ్యాప్ చేసుకొని రోషన్ సినిమాని థియేటర్లలోకి తీసుకురావాలని ఫిక్స్ అయ్యారు. నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 'అఖండ 2' సినిమా డిసెంబర్ 5న రిలీజ్ అవుతుండగా.. డిసెంబర్ 19న జేమ్స్ కామెరాన్ తెరకెక్కించిన 'అవతార్ 3' మూవీ విడుదల కానుంది. అందుకే వీటి మధ్యలో ఖాళీగా ఉన్న డేట్ కి మోగ్లీ సినిమాని తీసుకొస్తున్నారు. ఈ మేరకు ఓ స్పెషల్ అనౌన్స్ మెంట్ వీడియోని మేకర్స్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఇందులో 'కలర్ ఫోటో' సినిమా 5వ యానివర్సరీ పోస్టర్ డిజైన్ చేయించానని డైరెక్టర్ సందీప్ రాజ్ చెబుతుండగా.. 10వ యానివర్సరీకి మంచి ఐడియా వచ్చిందని, ఆ పోస్టర్ కి 'మోగ్లీ' ట్రైలర్ ను అటాచ్ చేద్దామని కమెడియన్ హర్ష చెముడు సెటైర్లు వేస్తాడు. 'కలర్ ఫోటో' సినిమా వచ్చినప్పుడు ఇంటర్ చదువుతున్న రోషన్.. ఇప్పుడు హీరో అయ్యాడని, సందీప్ మాత్రం ఇంకా ఆ సినిమానే పట్టుకొని వేలాడుతున్నాడని అంటాడు. దానికి పక్కనే ఉన్న రోషన్ నవ్వగా.. మన సినిమా స్టార్ట్ అయి కూడా రెండు సంవత్సరాలు అయిందని కౌంటర్ ఇస్తాడు హర్ష. చివరకు డిసెంబర్ లో రిలీజ్ చేద్దామని డిసైడ్ అవుతారు. డిసెంబర్ 5న రిలీజ్ చేద్దామని, అప్పుడు అందరికీ జీతాలు పడతాయని సందీప్ రాజ్ అంటాడు. "బాలయ్యతో కొట్టించుకోవాలని అంత సరదాగా ఉంటే చెప్పు, దానికి వేరేలా ప్లాన్ చేద్దాం" అంటూ హర్ష చెముడు పరోక్షంగా అదే తేదీకి 'అఖండ 2' వస్తుందనే విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'డాకు మహారాజ్' సినిమాలో బాలకృష్ణ చేతిలో సందీప్ రాజ్ తన్నులు తిన్నాడనే సంగతి గుర్తు చేస్తాడు. 'కలర్ ఫోటో'ని ప్రభాస్ బర్త్ డేకి విడుదల చేసినట్లే.. ఈసారి రజనీకాంత్ పుట్టిన రోజు డిసెంబర్ 12న రిలీజ్ చేస్తే క్రిస్మస్ వరకూ తమ సినిమానే ఉంటుందని అంటారు. మాస్ కి, క్లాస్ కి.. యూత్ కి, ఫ్యామిలీ ఆడియన్స్ కి.. అన్ని వర్గాల వారికి మంచి థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చే లవ్ స్టోరీ 'మోగ్లీ' అని పేర్కొన్నారు. చెవులు మూసుకున్నా వినబడాలి.. కళ్లు మూసుకున్నా కనబడాలి అనే రేంజ్ లో ప్రమోషన్స్ చేస్తామని చెప్పారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS. H.NO.18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M) MEDCHA-500047, MEDCHAL MALKAJGIRI DISTRICT, TELANGANA PUBLISHED FROM H.NO 02-66/254, MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL - 500055, DISTRICT MALKAJGIRI, TELANAGANA, EDTIOR : G. DAYAKAR REDDY, RNI : TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040-45046154